నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 25-9-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:27 సంచిక:45 పేజీలు: 4 వెల: రూ.1/-

చరిత్రలో నిలిచిపోనున్న రెవెన్యూ చట్టం

ట్రాక్టర్ల ర్యాలీ ప్రారంభోత్సవంలో మంత్రి సబిత

వికారాబాద్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన నూతన రెవెన్యూ చట్టం రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. చారిత్రాత్మక రెవెన్యూ చట్టం ఆమోదం పొందిన సందర్భంగా తాండూరులో ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఏర్పాటు చేసిన ట్రాక్టర్ల ర్యాలీని ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డితో మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా రైతుల తరుపున ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రానున్న కాలంలో బిల్లు ఫలాలు ప్రజలు పొందుతారని మంత్రి తెలిపారు.ఇదిలావుంటే పట్టభద్రుల ఓటు నమోదును ఉత్సాహంగా నిర్వహించాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తాండూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన కో ఆర్డినేటర్ల సన్నాహక సమావేశంలో మంత్రి మాట్లాడారు. 2017 కంటే ముందు డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాండూరు నియోజకవర్గంలో 3,344 మంది మాత్రమే గత ఎన్నికల్లో నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం నమోదులో మొదటి స్థానంలో నిలవాలని సూచించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, కో ఆర్డినేటర్లు తమ ఇంటి నుంచే నమోదు పక్రియను మొదలు పెట్టాలి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం పార్టీ బలపర్చిన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఇందుకు సైనికుల్లా పని చేయాలన్నారు. 2017 వరకు ఏదైనా డిగ్రీ లో ఉత్తీర్ణులు అయిన వారు ఓటరుగా నమోదుకు అర్హులు అన్నారు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన నూతన రెవెన్యూ చట్టం విప్లవాత్మక మైందన్నారు. దీంతో పేద రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, విద్యామౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నాగేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్మాణ ప్రగతిపై అధికారులతో సమీక్షించిన సిఎస్ సోమేశ్ కుమార్. చిత్రంలో డిజిపి మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కరోనాతో గాభరా పడొద్దు

నియోజకవర్గ ప్రజలకు ఎర్రబెల్లి భరోసా

హైదరాబాద్,సెప్టెంబర్2 4(ఆర్ఎన్ఎ): కరోనా బాధితులెవరూ ఆందోళన చెందొద్దని మంత్రి ఎర్రబెల్లి దయారక్ రావు మరోమారు ప్రజలకు భరోసా ఇచ్చారు. కరోనా తీవ్రత తగ్గింది మీకేం కాదు. ధైర్యమే మనకు రక్ష. మీ అందరికీ అండగా నేనున్నానని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జనగామ జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గ కరోనా బాధితులు, వారి కుటుంబ సభ్యులతో మంత్రి గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కరోనా బాధితులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, పోలీసులు తదితరులతో మంత్రి మాట్లాడారు. మనం ధైర్యంగా ఉండి కరోనాను జయిద్దాం అన్నారు. అన్ని రకాల వైద్య సదుపాయాలతో పాటు, అంబులెన్స్, ఇతర సౌకర్యాలను కూడా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇంకా మీకు సమస్యలు ఉంటే నన్ను గానీ, నా సిబ్బందిని గానీ, సంప్రదించాలని మంత్రి సూచించారు.

తెలంగాణలో మరో మినీ ఎన్నికల సందడి

గ్రేటర్,ఎమ్మెల్సీ, దుబ్బాక ఉప ఎన్నికల వేడి

ఎమ్మెల్యేలతో ప్రగతిభవన్‌లో సిఎం కెసిఆర్ సమీక్ష

హైదరాబాద్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): తెలంగాణలో మరో మినీ ఎన్నికల సందడి మొదలైంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషనతో పాటు పట్టభద్రుల కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వంతో పాటు ఎన్నికల సంఘం కసరత్తులు చేస్తోంది. మరోవైపు ఎన్నికల్లో పోటీకి ఆశావాహులు సిద్ధంగా ఉండగా.. గెలుపు గుర్రాలను అన్వేషించే పనిలో ప్రధాన పార్టీలు పడ్డాయి. ముఖ్యంగా జీహెచ్ఎంసీ ఎన్నికలపై అధికార టీఆర్ఎస్ పార్టీ దృష్టిసారించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) మేయర్ బొంతు రామ్మోహన్, మున్సిపాలిటీల పరిధిలోని ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రగతి భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ధరణి పోర్టల్, వ్యవసాయేతర ఆస్తుల నమోదుపై సీఎం కెసిఆర్ చర్చించినట్లు సమాచారం. నోటరీ, 58, 59 జీవో పరిధిలోని ఇండ్ల క్రమబద్ధీకరణపై కూడా మేయర్, ఎమ్మెల్యేలతో సీఎం కేసీఆర్ చర్చిస్తున్నారు. ఇదిలావుంటే టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంత్రి కేటీఆర్ పార్టీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో పార్టీ నాయకత్వం ఈ ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. దీనిలో భాగంగానే ఇప్పటికే రంగంలోకి దిగిన కేటీఆర్ గ్రేటర్ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో విడతల వారిగా సమీక్షలు నిర్వహించారు. ఎన్నికలకు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, డబుల్ బెడ్‌రూంల పంపిణీని వేగవంతం చేయాలని ఆదేశాలు జారీచేశారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం పార్టీ ఎమ్మెల్యేలు, మేయర్లతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎమ్మెల్యేలు, మేయర్లతో ప్రగతిభవన్‌లో భేటీ అయ్యారు. ఎన్నికల వ్యూహాలతో పాటు అభ్యర్థుల ఎంపికలపై తీసుకువాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. అలాగే పట్టభద్రుల కోటాలో అభ్యర్థుల ఎంపికపై కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ స్థానం నుంచి మేయర్ బొంత రామ్మోహన్‌ను బరిలో నిలిపేందుకు పార్టీ అధిష్టానం ప్రయత్నం చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చసాగుతోంది. పట్టభద్రుల కోటా ఎన్నికలో తీవ్ర పోటీ ఉండటం, ప్రభుత్వంపై వ్యతిరేకత, ఉద్యోగుల్లో నిరాశ విపక్షాలకు లబ్ధి చేకూర్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉద్యమ కాలంలో ఉస్మానియా యూనివర్సిటీతో సత్సంబంధాలు, స్థానిక యువతలో మంచి ఫాలోయింగ్ ఉన్న రామ్మోహన్‌ను బరిలో నిలిపితే అనుకూల ఫలితాలు వచ్చే అవకాశం ఉందని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. భేటీలో ఈ అంశం కూడా ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు దుబ్బాక ఉప ఎన్నికపై కూడా సీఎం పార్టీ నేతలతో చర్చించనున్నారు.

ముగిసిన అదనపు కలెక్టర్ నగేశ్ తదితరుల కస్టడీ

నాలుగు రోజుల పాటు ప్రశ్నల వర్షం

హైదరాబాద్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): నర్సాపూర్ లంచం కేసులో ఐదుగురు నిందితుల కస్టడీ గురువారంతో ముగిసింది. మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో అరుణారెడ్డి, తహసీల్దార్ సత్తార్, జూనియర్ అసిస్టెంట్ వసీం, జీవన్‌గౌడ్‌ను ఏసీబీ అధికారులు నాలుగు రోజుల పాటు ప్రశ్నించారు. ప్రధానంగా నగేశ్‌పై ఏసీబీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించి కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ ఐదుగురి కస్టడీ ముగియడంతో.. వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించనున్నారు.

ఓ భూమికి ఎన్వోసీ ఇచ్చేందుకు ఎకరానికి రూ.లక్ష చొప్పున రూ. 1.12 కోట్లు డిమాండ్ చేసిన కేసులో నగేశ్‌తో పాటు మిగతా నలుగురు అరెస్టు అయిన విషయం తెలిసిందే. రెండు దఫాలుగా రూ.40లక్షల లంచం తీసుకున్నట్టు ఇప్పటికే ఆధారాలు లభించటంతో ఆ సొమ్ము ఎక్కడ దాచారన్నదానిపైన విచారణ కొనసాగింది. బ్యాంకు లాకర్లపై కూడా నగేశ్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.

పోలవరంతో పాటు జిఎస్టీ బకాయిలు ఇవ్వండి

ఆర్థిక మంత్రిని కోరిన మంత్రి బుగ్గన

న్యూఢిల్లీ,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): పోలవరం నిధులతో పాటు, జిఎస్టీ బకాయిలను తోణమే విడుదల చేయాలని కేంద్రాన్ని ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కోరారు. గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను కలిసి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా బుగ్గన మీడియాతో మాట్లాడుతూ పోలవరంకు నిధులతో పాటు జీఎస్టీ బకాయిలు, వివిధ పథకాలకు సంబంధించిన నిధులపై చర్చించామని అన్నారు. రామాయపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరాము. ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలంటూ మరోసారి ప్రస్తావించాం. రాష్ట్రానికి రూ. మూడు వేల కోట్లకు పైగా జీఎస్టీ బకాయిలు రావాల్సి ఉంది. పోలవరం పై రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిన నిధులను రీయింబర్స్ చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం. కాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటన సందర్భంగా ఆయన కూడా ఈ అంశాలన్నింటిని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. పోలవరం బకాయిలను కేంద్రం త్వరగా విడుదల చేస్తే బాగుంటుంది. మేం ప్రతిపాధించిన అన్ని అంశాలపై కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారు. బకాయిల చెల్లింపులు అనేది ఒక నిరంతర పక్రియలాగా కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు. కాగా బుగ్గన వెంట ఎంపీలు కృష్ణదేవ రాయలు, కోటగిరి శ్రీధర్, సలహాదారు అజయ్ కల్లం తదితరులు ఉన్నారు.

కేంద్రమంత్రులతో టిడిపి ఎంపిల భేటీ

కేంద్ర మంత్రులతో టీడీపీ ఎంపీలు వరుస భేటీలు కొనసాగాయి. కేంద్ర పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులను టీడీపీ ఎంపీలు కలిశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఉపాధి హామీ పథకాల అమలు పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై కేంద్ర మంత్రులకు టీడీపీ ఎంపీలు ఫిర్యాదు చేశారు.అంతకముందు కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరితో టీడీపీ ఎంపీలు భేటీ అయ్యారు. ఏపీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీలో ఎంపీలు గల్లా జయదేవ్, రామ్మోహన్, కేశినేని, కనకమేడల పాల్గొన్నారు.

ఢిల్లీలో కరోనా రెండోదశ విజృంభణ

-పెరుగుతున్న కేసులపై సిఎం కేజ్రీవాల్ వెల్లడి

న్యూఢిల్లీ,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): దేశ రాజధానిలో కరోనా వైరస్ రెండోసారి విజృంభించిందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ పేర్కొన్నారు. ఈనెల ఆరంభంలో అనూహ్యంగా రోజువారీ కేసులు 4000 దాటడం వైరస్ రెండో విడత దాడి చేస్తోందనేందుకు సంకేతమని సీఎం స్పష్టం చేశారు. గత ఏడాది డిసెంబర్‌లో కేరళలో కరోనా కలకలం మొదలైన అనంతరం వైరస్ రెండో దశ తలెత్తిందని ప్రకటించిన తొలి రాష్ట్రం ఢిల్లీ కావడం గమనార్హం. కేజీవ్రాల్ గురువారం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ దేశ రాజధానిలో వైరస్ కేసులు పెరగడం కోవిడ్-19 రెండో దశకు సంకేతమని నిపుణులు చెబుతున్నారని అన్నారు.

సెప్టెంబర్ 16న ఢిల్లీలో 4500 కోవిడ్-19 కేసులు వెలుగుచూడగా, ఆ తర్వాత కేసులు క్రమంగా తగ్గాయని మళ్లీ గడిచిన 24 గంటల్లో 3700 కేసులు వెలుగుచూశాయని సీఎం కేజీవ్రాల్ చెప్పుకొచ్చారు. రాబోయే రోజుల్లో కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని అన్నారు. ఢిల్లీలో సెప్టెంబర్ 9న తొలిసారిగా 4000కు మించి కరోనా వైరస్ కేసుల సంఖ్య నమోదవగా అదేరోజు 20 మంది మరణించారు. వైరస్ దేశ రాజధానిని తాకిన తర్వాత అత్యధికంగా ఈనెల 16న 4473 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇక దేశవ్యాప్తంగా గురువారం నాటికి కరోనా వైరస్ కేసుల సంఖ్య 57 లక్షలు దాటగా, 91,149 మంది మరణించారు. గడిచిన 24 గంటల్లో మహమ్మారి బారినపడి 1129 మంది ప్రాణాలు కోల్పోయారు.

రోహతక్‌లో దారుణ ఘటన

-అసిస్టెంట్ ప్రొఫెసర్ కుటుంబం ఆత్మహత్య

చండీఘడ్,సెప్టెంబర్24((ఆర్ఎన్ఎ): ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆత్మహత్య చేసుకోగా, ఆయన భార్య, ఇద్దరు కూతుళ్లు చెరువులో దూకారు. ఈ విషాద ఘటన హర్యానాలోని రోహతక్‌లో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రమోద్ షహారణ్(38) స్థానికంగా ఉన్న ఓ నర్సింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రమోద్ భార్య మీనాక్షి కూడా లెక్చరరే. వీరికి ఎన్నా(10), ప్రీశా(4) అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.అయితే ప్రమోద్ బుధవారం విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే విషం సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య కంటే ముందు ఈ విషయాన్ని తన స్నేహితులకు వాట్సాప్ ద్వారా ప్రమోద్ తెలియజేశాడు. దీంతో హుటాహుటిన అక్కడికి చేరుకుని ప్రమోద్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లినప్పటికీ, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త ఆత్మహత్య విషయం మీనాక్షికి తెలిసింది. ఆమె కూడా తన ఇద్దరు పిల్లలను తీసుకుని స్థానికంగా ఉన్న చెరువు వద్దకు వెళ్లింది. పిల్లలను చెరువులో తోసేసి ఆమె దూకింది. మీనాక్షి, ప్రీశా నీటిలో మునిగిపోగా, ఎన్నా ప్రాణాలతో ఒడ్డుకు చేరింది. తాము నివాసం ఉంటున్న ప్రాంతానికి ఎన్నా చేరుకుని పొరుగింటి వారికి జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. చెరువులో నుంచి మీనాక్షి, ప్రీశా మృతదేహాలను గురువారం ఉదయం వెలికితీశారు. అయితే ప్రమోద్, మీనాక్షి ఆత్మహత్యలకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తెలంగాణలో కొత్తగా 2,296 కరోనా కేసులు

హైదరాబాద్,సెప్టెంబర్24((ఆర్ఎన్ఎ): తెలంగాణలో కొత్తగా 2,296 కరోనా కేసులు నమోదు అయ్యాయి. గడిచిన 24 గంటల్లో కరోనాతో 10 మంది మృతి చెందగా.. తెలంగాణలో కరోనా కేసులు 1,77,070కు చేరుకున్నాయి. 1,062 మరణాలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో 29,873 యాక్టివ్ కేసులున్నాయి. 1,46,135 మంది రికవరీ అయ్యారు. తెలంగాణలో ఇప్పటివరకు 26.28 లక్షల కరోనా టెస్టుల నిర్వహించారు. కొత్తగా జీహెచ్ఎంసీ 321, రంగారెడ్డి 217, మేడ్చల్‌లో 173 కేసులు నమోదు చేశారు.

కర్నాటకలో కరోనా విజృంభణ

కాంగ్రెస్ ఎమ్మెల్యే నారాయణరావు మృతి

బెంగళూరు,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే కరోనాతో మరణించారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలోని బసవకళ్యాణ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీ నారాయణరావు (65) గురువారం మధ్యాహ్నం ప్రైవేట్ దవాఖానలో చనిపోయారు. ఈ నెల 1న ఆయనకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చేరారు. అయితే ఎమ్మెల్యే నారాయణ రావుకు కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉన్నదని, ఆయన ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ మనీశ్ రాయ్ బుధవారం తెలిపారు. కాగా గురువారం నారాయణరావు ఆరోగ్య పరిస్థితి మరింతగా విషమించడంతో మధ్యాహ్నం 3.55కు చనిపోయినట్లు మణిపాల్ హాస్పిటల్స్ యాజమాన్యం వెల్లడించింది. కర్ణాటకలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా ఎమ్మెల్యే నారాయణ రావు మరణ వార్త తెలిసింది. దీంతో ఆయనకు నివాళిగా సభను కొంతసేపు వాయిదా వేశారు. ఆ రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య 5.34 లక్షలు దాటగా 8 వేల మందికిపైగా మరణించారు.

బ్యాలెట్ పద్ధతిలోనే గ్రేటర్ ఎన్నికలు నిర్వహించండి

ఎన్నికల కమిషన్ పార్థసారథికి టిఆర్ఎస్ వినతి

హైదరాబాద్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): కరో నేపథ్యంలో గ్రేటర్ ఎన్నికనలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని టిఆర్ఎస్ కోరింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథిని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని టీఆర్ఎస్ నేతలు కలిశారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలోనే నిర్వహించాలని ఎన్నికల కమిషనర్‌కు టీఆర్ఎస్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిర్వహణపై అభిప్రాయాలను తెలుపాలని ఇప్పటికే ఆయా పార్టీలకు ఎన్నికల సంఘం లేఖలు రాసిన విషయం విదితమే. జీహెచ్ఎంసీ ప్రస్తుత పాలకమండలి పదవీకాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీతో పూర్తవుతున్నది. ఈలోగా కొత్త పాలకమండలిని ఎన్నుకోవాల్సి ఉంటుంది.ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జీహెచ్ఎంసీ ఎన్నికల నిర్వహణకు కమిషనర్ ఏర్పాట్లు మొదలుపెట్టారు. గతంలో 1200మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేయగా, ఈసారి కరోనా నేపథ్యంలో 800మంది ఓటర్లకు ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో ఈసారి పోలింగ్ కేంద్రాల సంఖ్య 10వేలకు చేరుతుందని అధికారులు తెలిపారు.

రిజిస్ట్రేషన్ల పై వివరణ ఇవ్వండి

-తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

హైదరాబాద్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): అక్రమ లే అవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. గత నెల 26న రిజిస్ట్రేషన్ల శాఖ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ న్యాయవాది గోపాల్‌రెడ్డి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. ఆకస్మికంగా రిజిస్ట్రేషన్లను నిలిపివేయడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం అక్టోబరు 14లోపు పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను అక్టోబర్ 15కి వాయిదా వేసింది.

చరిత్రలో నేటినిజం



కం॥ వ్యాసమ మిలాదియా నమునకు
నొకమేటి రచించి నట్టి నిఖిలమతిపై
సయితమెరుగనిదియు... ను
త్రిముదు నరసెను "సతీసు ధావను"ప్రైనన్!!

(సెప్టెంబర్ 25 సతీష్‌ధావన్ జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210



నేటి నిజం
శుక్రవారం 25-9-2020

కరోనా విజృంభణ వేళ కానరాని దృఢ వైఖరి

కరోనా విజృంభిస్తున్న వేళ కేంద్రం గతంలో చూపిన ఉత్సాహం చూపడం లేదు. ఆయా రాష్ట్రాలకు బాధ్యతలను వదిలేసింది. ప్రజలు కూడా తమ ఖర్మానికి తాము అనుభవిస్తున్నామన దశకు వచ్చారు. గతంలో నిత్యం రివ్యూలు, ఆరాలు ఉండేవి. ఇప్పుడు కేంద్రం,రాష్ట్రాల తీరు మారింది. ప్రజలు అలవాటు పడ్డవేళ ప్రధాని మోడీ కేవలం ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాత్రమే సమీక్షించారు. అందులో తెలుగు రాష్ట్రాల్లోఏపి తప్ప తెలంగాణ లేదు. అయినా స్వాంతన చర్యలకు సంబంధించి ఎలాంటి హామీ దక్కలేదు.

7 రాష్ట్రాల్లోని 60 జిల్లాల్లో మాత్రమే పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని, తక్కినచోట్ల పెద్దగా ఆందోళన చెందవలసింది లేదని ప్రధానమంత్రి బుధవారం నాడు ముఖ్యమంత్రులతో నిర్వహించిన వీడియో సమావేశంలో అభిప్రాయపడ్డారు. కరోనా సమీక్షా సమావేశం జరిగిన రోజే,కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సురేశ్ అంగడి కరోనా బారిన పడి కన్నుమూశారు. అనేక మంది కేంద్రమంత్రులకు వైరస్ సోకింది, పలువురు ఎంపిలు మరణించారు. ఎమ్మెల్యేలు మరణించారు. ఇక ఛోటామోటా నాయకులు పేర్లు చెప్పలేం. ఈ మరణాలు కరోనా పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. మరణాల సంఖ్య 2 శాతానికి లోపుగానే ఉన్నప్పటికీ, సోకినవారిని, వారి కుటుంబ సభ్యులను, వారి చుట్టూ ఉన్నవారినీ కూడా భయభ్రాంతులకు లోనుచేస్తున్నది. భారతదేశంలో పట్టణాలలో కొవిడ్ గణాంకాలే లోపభూయిష్ఠమని భావిస్తుండగా, గ్రామీణ ప్రాంతాలలో విస్తరించిన సమయంలో అన్ని లెక్కలూ సరిగ్గా ఉంటాయని ఆశించడం అత్యాశే అవుతుంది.కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు మైక్రో కంటైన్‌మెంట్ జోన్లను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆయా రాష్ట్రాలకు మరోమారు సూచించారు. చిన్న కంటెయిన్‌మెంట్ జోన్ల వల్ల వైరస్ వ్యాప్తి తగ్గడంతో పాటు, ఆర్థిక కార్యకలాపాలకు విఘాతం కలగబోదని వివరించారు. ఆ నిర్ణయం ఎంత మేరకు సత్ఫలితాలనిచ్చిందో సమీక్షించాలని కోరారు. ప్రధానంగా కరోనా కట్టడికి ఇంతకాలం విధించిన లాక్‌డౌన్, నిర్బంధాలు తదితర కారణాల వల్ల ఆర్థిక కార్యకలాపాల పునరుద్ధరణకు అడ్డంకిగా మారింది. మరోవైపు వైరస్ వ్యాప్తిని నిరోధించే ఉద్దేశంతో పంజాబ్, పశ్చిమబెంగాల్ సహా పలు రాష్ట్రాలు ప్రధాని సూచలన కన్నా ముందే స్థానికంగా కొన్ని రోజుల పాటు లాక్‌డౌన్ విధించిన విషయం తెలిసిందే. వైరస్‌తో పోరు సాగిస్తూనే ఆర్థిక కార్యకలాపాలు ఊపందు కునేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధాని కోరారు. అయితే కరోనా మహమ్మారి ముప్పు ఇంకా తొలగిపోలేదని ప్రధాని కూడా అంగీకరించారు. కరోనా నిర్ధారణ పరీక్షలు జరపడం, అనుమానితులను గుర్తించడం, చికిత్స అందించడం, వ్యాధిపై ప్రజలకు సరైన సమాచార మివ్వడం.. అనే విషయాలపై మరింత దృష్టి అవసరమని అ భిప్రాయపడ్డారు. లక్షణాలు లేని వారే అధికంగా ఉంటున్నారని, కోవిడ్ వ్యాధిని కొందరు తేలికగా తీసుకుంటున్నారని మోదీ పేర్కొన్నారు. అందువల్ల సరైన, స్పష్టమైన సమాచారం అందించడం వల్ల ప్రజల్లో వ్యాధికి, నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన అపోహలను తొలగించ వచ్చని తెలిపారు. మొత్తంగా కేవలం సూచనలు,సలహాలు తప్ప పెద్దగా ఆర్థిక కార్యకలపాలకు సంబంధించి ప్రధాని హామీ మాత్రం ఇవ్వలేదు. ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపైనా స్పష్టత ఇవ్వలేదు. తొలి రోజుల్లో అమలు చేసిన లాక్‌డౌన్‌తో మెరుగైన ఫలితాలను సాధించా మని చెప్పినా తదుపరి ఎందుకు విఫలమయ్యామన్న దానిపై చర్చచేయలేదు. వైరస్ వ్యాప్తి అధికంగా ఉన్న ప్రాంతాల్లోని అధికారులతో స్వయంగా మాట్లాడి, పరిస్థితిని సమీక్షించేలా వారంరోజుల ప్రణాళిక రూపొందిం చుకోవాలని సూచించారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో అధికారుల్లో చైతన్యం మరింత పెరుగుతుందన్నారు. ఇకపోతే పేదలకు ఉచితంగా చికిత్స అందించే ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజనకు సెప్టెంబర్ 25

నాటికిప్రధాని తెలిపారు. దేశంలోని ప్రాథమిక ఆరోగ్య, వైద్య సదుపాయాల గురించి చట్టసభలలో కూడా వివరంగా చర్చించి ఉంటే బాగుండేది. సుదీర్ఘకాలంగా ప్రజారోగ్యరంగానికి తగినంత ప్రాధాన్యం ఇవ్వక పోవడం వల్ల, ఇప్పుడు పెను ఉపద్రవం ఎదురయినప్పుడు, తగినంత సామర్థ్యంతో స్పందించలేక పోయారు.. ఎన్ని వైఫల్యాలు ఉన్నప్పటికీ, ఉ న్న వనరులతోనే, అంకిత భావంతో వైద్య ఆరోగ్య సిబ్బంది సహాయంతో ఉపద్రవాన్ని సాధ్యమైనంత కట్టడి చేయగలిగారు. అయినా ప్రజల్లో నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఈ విషయంలో ఎంత ఖర్చుకైనా వెనకాడకుండా ఆస్పత్రులను బలోపతేం చేసివుంటే బాగుండేది. కరోనా విజృంభించిన ఆరునెలలు గడచిన తరువాత పరిస్థితిని ఇప్పుడు సమీక్షిస్తే, దేశంలో మరణాలు లక్ష సంఖ్యకు చేరువలో ఉన్నాయి. రోజుకు సుమారు వెయ్యి మందికి పైగా చనిపోతు న్నారు. ప్రతిరోజూ 90వేల కొత్త కేసులు వస్తున్నాయి. అయినా సరే పెనుప్రమాద దశను దాటినట్టేనని ప్రభుత్వాలు సూచనలు చేస్తున్నాయి. వైపరీత్యాల నిధుల నుంచి కరోనా అవసరాల కోసం ఇప్పటి దాకా అనుమతించిన 35 శాతం వ్యయాన్ని, 50 శాతానికి పెంచుతున్నట్టు ప్రధానమంత్రి ప్రకటించారు. ఇది ఎంతో ఉపకరించే నిర్ణయం. కరోనా దాడి కారణంగా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉన్నది. పరిస్థితిని తామే ఎదుర్కొనాలి. అందుకు కావలసిన సహాయాలు అందడంలేదు. ఇవ్వవలసి ఉన్న పన్ను పరిహారాల కోసం కూడా కేంద్రం అనేక కొర్రీలు పెడుతున్నది. ఆదాయం తగ్గిపోయి, ఆరోగ్య రంగానికి అధిక వ్యయం చేయవలసి వస్తున్న సమయంలో ఏ కొద్దిపాటి వెసులుబాటు అయినా ఊరటను ఇస్తుంది. కానీ జిఎస్టీ బకాయలయినా ఇవ్వాలన్న పట్టించుకోవడం లేదు. అయితే కేవలం పరీక్షలు నిర్వహించడం, వ్యాధి సోకే అవకాశం ఉన్నవారిని గుర్తించడం, చికిత్స చేయడం? ఈ మూడు అంశాలను ప్రధాని తన సందేశంలో ప్రధానంగా గుర్తు చేశారు. అధిక పరీక్షలు నిర్వహించడంలో తెలంగాణ ప్రభుత్వం మొదటలో ఏమంత చొరవ చూపలేదు కానీ, ఆంధ్రప్రదేశ్ క్రియాశీలంగానే ఉన్నదన్న పేరు తెచ్చుకున్నది. చిన్నచిన్న పట్టణాలు అనేకం ఉన్న రాష్ట్రంలో వైరస్ చాలా విస్తృతంగా వ్యాపించింది. వైద్యసదుపాయాలు కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడంతో, మరణాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు కూడా ఆ రాష్ట్రంలో రోజుకు సుమారు 50 మంది మరణిస్తున్నారు. ప్రభుత్వాలు తక్షణం తన ప్రాధాన్యాలను రాజకీయాలనుంచి ఆరోగ్యరంగం మీదకు మళ్లించాలి. అధికారయంత్రాంగం మాత్రం వారికి తోచిన తీరులో నిర్వహిస్తూ వస్తున్నారు.ప్రైవేటు ఆస్పత్రులను నియంత్రించడానికి, రోగులకు నాణ్యమైన చికిత్స అందించడానికి జరిగిన ప్రయత్నాలు అంతంతమాత్రమే అని చెప్పుకోవాలి. ఇప్పటికైనా ఈ పరిస్థితిని అధిగమించి ముందుకు సాగితే తప్ప ప్రజల్లో భరోసా నింపలేం.

కరోనా రోగులను గుర్తించే జాగిలాలు

-ఫిన్లాండ్‌లో రంగంలోకి దింపిన అధికారులు

న్యూఢిల్లీ,సెప్టెంబర్24((ఆర్ఎన్ఎ):ఫిన్లాండు దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో కరోనా సోకిన ప్రయాణికులను గుర్తించడానికి జాగిలాలను రంగంలోకి దించారు. కరోనా వైరస్ సోకిన ప్రయాణికులను గుర్తించేందుకు వీలుగా ప్రత్యామ్నాయ పరీక్ష పద్ధతిని నాలుగునెలల పాటు ప్రయోగాత్మకంగా విమానాశ్రయంలో జాగిలాలను మోహరించామని ఫిన్లాండు అధికారులు చెప్పారు. ఫిన్లాండు దేశంలోని హెల్సింకి విమానాశ్రయంలో జాగిలాలు కరోనా సోకిన వారిని గుర్తిస్తాయని జాగిలాల శిక్షకురాలు సుసన్నా పావిలైనెస్ తో క్సీ చెప్పారు. ఫిన్లాండు దేశంలోని స్మెల్ డిటెక్షన్ అసోసియేషన్ శిక్షణ ఇచ్చిన నాలుగు జాగిలాలు హెల్సింకి అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం నుంచి కరోనా ప్రయాణికులను గుర్తించే పనిని ప్రారంభించాయి. కరోనా రోగులను వాసన ద్వారా జాగిలాలు గుర్తించేపద్ధతి చాలా మంచిదని, ఇది ఆశాజనకమైనదని హెల్సింకి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అన్నా హీల్మ్ జోర్క్మన్ చెప్పారు.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తర్వాత ఫిన్లాండు దేశంలో కరోనా రోగులను గుర్తించేందుకు జాగిలాలను వినియోగిస్తున్నారు. విమానాశ్రయంలోని ప్రయాణికులకు ఉచితంగా ఈ జాగిలాలతో కరోనా పరీక్ష చేయనున్నారు. జాగిలం పరీక్షలో కరోనా ఉందని తేలితే వారికి పీసీఆర్ పరీక్షలు కూడా చేస్తారు. ఫిన్లాండు విమానాశ్రయంలో రెండు షిఫ్టులలో పనిచేసేలా నాలుగు జాగిలాలను రంగంలోకి దించారు.

జాన్సన్ అండ్ జాన్సన్ ముందంజ

-క్లినికల్ ట్రయల్స్‌లో మంచి ఫలితాలు

వాషింగ్టన్,సెప్టెంబర్24((ఆర్ఎన్ఎ):అమెరికాలో జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ సుమారు 60 వేల మందిపై కరోనా వ్యాక్సిన్ కోసం మూడవ దశ ట్రయల్స్‌ను ప్రారంభించింది. సింగిల్ షాట్ కోవిడ్ టీకాను జే అండ్ జే కంపెనీ పరీక్షిస్తున్నది. ఒకవేళ టీకా సక్సెస్ అయితే వచ్చే ఏడాది బిలియన్ల సంఖ్యలో డోస్‌లను మార్కెట్ చేయనున్నట్లు జే అండ్ జే పేర్కొన్నది. అత్యంత శీతల వాతావరణంలో తమ వ్యాక్సిన్‌ను దాచిపెట్టాల్సిన అవసరం ఉండదని డాక్టర్ బరౌచ్ తెలిపారు. మిగితా వైరల్ వ్యాక్సిన్లతో పోలిస్తే ఇది తమకు అడ్వాంటేజ్ అన్నారు. అయితే మూడవ దశకు సంబంధించిన ఫలితాలు ఈ ఏడాది చివర లేదా వచ్చే ఏడాది ఆరంభంలో వెలుబడే అవకాశాలు ఉన్నాయి. 2021లో సుమారు వంద కోట్ల డోస్‌లను ఉత్పత్తి చేయాలని జే అండ్ జే భావిస్తున్నది. కరోనా వైరస్ నియంత్రణ కోసం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వ్యాక్సిన్ అభివృద్ధి జరుగుతున్నది. అయితే 10 టీకాల కోసం ప్రపంచవ్యాప్తంగా మూడవ దశ ట్రయల్స్ ప్రారంభం అయ్యాయి. అమెరికాలో మూడవ దశ ట్రయల్స్ నిర్వహిస్తున్న నాలుగవ కంపెనీగా జాన్సన్ అండ్ జాన్సన్ నిలిచింది. అమెరికా జాతీయ అంటువ్యాధుల సంస్థ డైరక్టర్ ఆంథోనీ ఫౌసీ కూడా జాన్సన్ టీకా ట్రయల్స్‌పై స్పందించారు. సార్స్ సీవోవీ2 వైరస్‌ను గుర్తించిన 8 నెలల్లోనే అమెరికాలో నాలుగవ వైరస్ టీకా ట్రయల్స్ మూడవ దశకు చేరుకున్నట్లు చెప్పారు. వ్యాక్సిన్ టెక్నాలజీలో ఇది అసాధారణ పక్రియ అన్నారు.

ఆపరేషన్ వార్ప్ స్పీడ్‌లో భాగంగా జాన్సన్ కంపెనీకి 1.45 బిలియన్ డాలర్లు కేటాయించారు. జలుబుకు కారణమైన అడినోవైరస్ ఆధారంగా సింగిల్ డోస్ వ్యాక్సిన్‌ను ఆ సంస్థ డెవలప్ చేస్తోంది. కరోనా వైరస్‌లోని స్పైక్ ప్రోటీన్‌లను నియంత్రించే విధంగా వ్యాక్సిన్ తయారీ జరుగుతున్నది. ఎబోలా వ్యాక్సిన్‌కు వాడిన టెక్నాలజీతోనూ దీన్ని తయారు చేస్తున్నారు.

ఇంటర్ సిలబస్ కుదింపు పేరుతో కుట్ర

-మహనీయుల చరిత్రను తొలగించడంపై ఎస్ఎఫ్ఐ నిరసన

హైదరాబాద్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ సిలబస్‌ను ప్రభుత్వం 30శాతం తగ్గించింది. అయితే అందులో జాతీయ నాయకులు, సంఘసంస్కర్తల జీవితాన్ని మరియు సామాజిక అంశాలైన పౌరసత్వం, సమాచార హక్కు చట్టం తదితర అంశాలను తొలగించడాన్ని నిరసిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లి ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్.ఎఫ్.ఐ.రాష్ట్ర అధ్యక్షార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి ,టి.నాగరాజులు మాట్లాడుతూ కేంద్రం సిబిఎస్ఇ కోవిడ్ నేపథ్యంలో సిలబస్ కుదించాలని నిర్ణయం చేసిన దానిలో భాగంగ తెలంగాణ రాష్ట్రంలో సిలబస్ 30శాతం తగ్గించాలని నిర్ణయంలో భాగంగా సబెక్ట్ కమిటీ నిర్ణయించిందనే పేరుతో బోర్డు కార్యదర్శి రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్, జ్యోతిరావు పూలే, పెరియార్,నారయణగురు,పౌరసత్వం, సమాచార హక్కు చట్టం,తదితరులు చరిత్రను తోలగించాలని నిర్ణయం చేయడం దుర్మార్గం అని అన్నారు. టిఆర్ఎస్ కూడా కేంద్రంలో బిజెపిలాగానే వ్యవరిస్తుందన్నారు. సిలబస్ నుండి తోలగించడం అంటే దేశానికి, సమాజానికి ఏంతో సేవ చేసిన జాతీయ నాయకులు, సంఘసంస్కర్తల ను అవమానించడమేనని అన్నారు. సిలబస్ తగ్గింపు పేరుతో దేశానికి లౌకికవాదం, సౌర్వభౌమత్వం,విలువలు నేర్పిన వారిని విద్యార్థుల నుండి దూరం చేసే చర్యను టి.ఆర్.ఎస్. విరమించుకోవాలన్నారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తిరిగి మహనీయులు జీవిత చరిత్ర ను పాఠ్యాశంలలో చేర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని చెప్పారు. అనంతరం బోర్డు కార్యదర్శి జలీల్ కి వినతిపత్రం అందించారు.

ఎల్ఆర్ఎస్ లేకుండా రిజిస్ట్రేషన్లు చేయాలి: జగ్గారెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): ఎల్ఆర్ఎస్ చార్జీలను ఇంకా తగ్గించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. ఎల్ఆర్ఎస్‌తో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్లు చేయాలని ఆయన సూచించారు. ఎల్ఆర్ఎస్ గడువు ఏడాది పొడిగించాలన్నారు. తలసాని గొప్పలు మాట్లాడి ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని చెప్పారు. లక్ష డబుల్ బెడ్రూమ్ ఇళ్లు చూపిస్తానన్న తలసాని 15వేలు చూపలేకపోయారని పేర్కొన్నారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మీకు అభ్యర్థులు లేక తమ నేతలను చేర్చుకున్నారని గుర్తుచేశారు. గ్రేటర్ ఎన్నికల్లో ప్రజలు ఎవరికి ఎలా షాకిస్తారో తెలియదన్నారు. టీఆర్ఎస్‌కు డబ్బు బలం ఉంది..ఓటుకు రూ.10వేలు అయినా ఇస్తారని అన్నారు. టీఆర్ఎస్ దగ్గర డబ్బు తీసుకొని కాంగ్రెస్‌కు ఓటేయండన్నారు. కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలు బయట కనిపిస్తున్నారా? అని ప్రశ్నించారు. తాము ఆరుగురం.. 110 మందికి గట్టి జవాబిస్తున్నామని వ్యాఖ్యానించారు.

నూతన రెవెన్యూ చట్టంపై భరోసా

గతంలోలాగా సమస్యలు రాకుంటేనే నమ్మకం

హైదరాబాద్,సెప్టెంబర్24 (ఆర్ ఎన్ఎ): ప్రగతి భవన్‌లో అధికారులతో సీఎం కెసిఆర్ సమీక్ష నిర్వహించిన సందర్భంగా నూతన రెవెన్యూ చట్టం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు రక్షణ లభిస్తుందని మరోమారు భరోసా ఇచ్చారు. ఊరూవాడా టిఆర్ఎస్ శ్రేణులు ర్యాలీలు తీస్తున్నారు. ట్రాక్టరల్తో ర్యాలీలు తీస్తూ కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు చేస్తున్నారు. అయితే ఇదంతా సమిసి పోవాలంటే ఇటీవలి లాంటి ఘటను మళ్లీమళ్లీ జరగకపోతే రూఢీ అవుతుంది. లేదా చట్టానికి అనుణంగా రెవెన్యూ సిబ్బం ది గట్టిగా నిస్వార్థంగా పనిచేయాల్ఇస ఉంటుంది. చట్టం చట్టంగానే ఉంటుంది. .తమ అక్రమాలు తమవే అన్న ధోరణి రాకుండా చూసుకోవాల్సి ఉంది. గ్రామాలు, మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రతీ ఇళ్ల వివరాలు ఆన్ లైన్ లో నమోదు కావా లని అధికారుల్ని కెసిఆర్ ఆదేశించారు. ధర ణి పోర్టల్ ప్రార ంభమైన తర్వాతే వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ పక్రియ ఉంటుందన్నారు. వ్యవసాయేతర ఆస్తులు కలిగివున్నవారికి మెరూన్ కలర్ పట్టాదార్ పాస్‌పుస్తకాల జారీ చేస్తామని తెలిపారు సీఎం కేసీఆర్. ఇకనుంచి ధరణి పోర్టల్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ ఉంటుందన్నా రు. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో వ్యవసాయేతర ఆస్తులకు మెరూన్ కలర్ పాస్‌బుక్‌లు ఇవ్వనున్నట్లు సీఎం కేసీఆర్ తెలిపారు. ప్రజల దీర్ఘకాల ప్రయోజనాలు ఆశించే ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. భూవివాదాలు, ఘర్షణల నుంచి ప్రజలను శాశ్వతంగా రక్షించేందుకు ఈ పాస్‌బుక్ ఉపయోగపడు తుందన్నారు. ఆస్తులకు పక్కా హక్కులు కల్పించడం కోసం పాస్ పుస్తకాలు జారీ చేయనున్నట్లు తెలి పారు. గ్రామాలు, పట్టణాల్లోని అన్ని ఇళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇందు లో ఎవరు కూడా ఎలాంటి అనుమానాలు పడాల్సిన అవసరం లేదని ప్రణాళికసంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ అన్నారు. మార్పులు చేర్పుల్లో భాగంగా ధరణి పోర్టల్ కాస్త ఆలస్యమైన పర్వాలేదన్నారు. దేవాదాయ, వక్ఫ్, ఎఫ్‌టీఎల్, నాలా, యూఎల్‌సీ పరిధిలో ఇళ్లకు మ్యుటేషన్ వర్తించదని తెలిపారు. భవిష్యత్తులో ఆస్తుల నమోదు, క్రమబద్ధీక రణ, ఉచిత నాలా కన్వర్షన్ ఉండదని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ జీవోలు, సర్క్యులర్లు తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేయా లని సీఎం ..అధికారుల్ని ఆదేశించారు. ప్రజలకు సమాచారం సులుభ ంగా అర్థమ య్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆస్తులన్నింటిని ఒక్క పైసా చెల్లించకుండా ఉచితంగా ఆన్‌లైన్‌లో మ్యూటేషన్ చేయించుకోవాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఇకపై ఏ తరహా రిజిస్ట్రేషన్ అయినా ధరణి పోర్టల్ ద్వారానే జరుగుతుందని సీఎం తెలిపారు.

90 వేలు దాటిన మరణాలు

కోట్ల 62 లక్షలమందికి పరీక్షలు

4 రాష్ట్రాల్లో పరీక్షలు ఎక్కువ, పాజిటివ్‌లు తక్కువ

న్యూఢిల్లీ,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా కేసుల మొత్తం సంఖ్య 56,46,010కి చేరుకున్నది. బుధవారం ఉ దయం 8 గంటల వరకు 24 గంటల్లో కొత్తగా 83,347 కేసులు నమోదు కాగా, 1085మంది మృతి చెందారు. దీంతో దేశంలో మొత్తం కేసుల సంఖ్య 56,46,01 0కి చేరుకోగా, మరణాలు 90,020కి చేరాయి. ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారి సంఖ్య 9,68,377 కాగా,కోలుకున్నవారు 45,87,613 మంది. దీంతో,కేసులోడ్ 17.15 శాతంగా, రికవరీ రేట్ 81.25శాతంగా,మరణాల రేట్ 1.59శాతంగా నమోదైందని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. దేశంలో కరోనా కేసుల సంఖ్య సెప్టెంబర్ 16కు 50 లక్షల మార్క్ దాటింది.

దేశంలో రోజుకు 12 లక్షలకుపైగా కరోనా పరీక్షలు నిర్వహించే సామర్థం ఉ న్నదని ఆరోగ్యశాఖ తెలిపింది. మంగళవా రం 9,53,683 శాంపిళ్లు పరీక్షించారు. దీంతో, మొత్తం పరీక్షల సంఖ్య 6,62, 79,462కు చేరింది. ప్రతి పది లక్షల జనాభాకు పరీక్షల సంఖ్య 48,028గా నమోదైంది. పరీక్షించినవారిలో పాజిటివ్ రేట్ 8.52 శాతంగా నమోదైంది. 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జాతీయ సగటుకన్నా అధికంగా పరీక్షలు నిర్వహించారని, ఆ రాష్ట్రాల్లోనే పాజిటివ్ రేట్ కూడా తక్కువగా ఉన్నదని ఆరోగ్యశాఖ పేర్కొన్నది. కొత్తగా నమోదైన 83,347 కేసుల్లో 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోనే 74 శాతం ఉన్నాయని తెలిపింది.

24 గంటల్లో మహారాష్ట్రలో 18,000కుపైగా, ఆంధ్రప్రదేశ్‌లో 7000కుపైగా, కర్నాటకలో6000కు పైగా కేసులు నమోదయ్యాయి. దేశంలో 24 గంటల్లో 1085 మరణాలు నమోదయ్యాయి. మహారాష్ట్రలో 392, కర్నాటకలో 83, ఉత్తర్‌ప్రదేశ్‌లో 77, తమిళనాడులో 76, పంజాబ్‌లో 66, బెంగాల్‌లో 62, ఆంధ్రప్రదేశ్‌లో 51, ఢిల్లీలో 37మరణాలు నమోదయ్యాయి. మొత్తం మరణాల సంఖ్య 90,020 కాగా, మహారాష్ట్రలో 33,407, తమిళనాడులో 8947, కర్నాటకలో 8228, ఆంధ్రప్రదేశ్‌లో 5461, ఉత్తర్‌ప్రదేశ్‌లో 5212, ఢిల్లీలో 5051, బెంగాల్‌లో 4483, గుజరాత్‌లో3352, పంజాబ్‌లో 2926, మధ్యప్రదేశ్‌లో 2035 నమోదయ్యాయి.

టైమ్స్ ప్రతిభావంతుల జాబితాలో ప్రధాని మోడీ

వందమంది జాబితాలో సుందర్ పిచాయ్‌కు కూడా చోటు

వాషింగ్టన్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): అమెరికా టైమ్ మ్యాగజైన్ ప్రపంచంలోని వందమంది ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో ప్రధాని మోడీకి చోటు దక్కింది. ఈ మేరకు జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లను చేర్చింది. జాబితాలో చోటుదక్కిన వం ద మందిలో బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా ఒక్కరే ఉండటం విశేషం. అయితే ఇదే సమయంలో చాలా పదునైన వ్యాఖ్యలు కూడా చేసింది. టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన జాబితాలో చైనా అధినేత జి జిన్‌పింగ్ కూడా చోటు దక్కించుకున్నారు. ఆయనతోపాటు జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ కూడా జాబితాలో ఉన్నారు. ప్రస్తుత అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్య అభ్యర్థులుగా నిలిచిన జో బిడెన్, కమలాదేవి హారిస్‌తోపాటు యూఎస్ ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసి, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, జపాన్ టెన్నిస్ క్రీడాకారిణి నవోమి ఒసాకా, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ క్లినికల్ మైక్రోబయాలజీ ప్రొఫెసర్ రవీంద్ర గుప్తాలు కూడా ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో ఉన్నారు. 100 మంది ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో భారత ప్రధాని నరేంద్రమోదీని చేర్చిన టైమ్స్ మ్యాగజైన్.. ఇదే సమయంలో ఆయనపై పదునైన వ్యాఖ్యలు కూడా చేసింది. భారతదేశంలోని 1.3 బిలియన్ జనాభాలో క్రైస్తవులు, ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, ఇతర మతాల ప్రజలు ఉన్నారని టైమ్స్ మ్యాగజైన్ ఎడిటర్ కార్ల్ విక్ రాశారు. 'భారతదేశంలోని ప్రధానమంత్రు లలో ఎక్కువ మంది హిందూ సమాజానికి చెందినవారు. అయితే మోదీ మాత్రమే వేరొకరి కోసం తనలాగే వ్యవహరిస్తున్నారు. అది పట్టింపు లేదు. హిందూ జాతీయవాద బీజేపీ ఎలిటిజం మాత్రమే కాదు, బహువచనాన్ని కూడా తిరస్కరించింది. ఇది ముఖ్యంగా ముస్లింలను లక్ష్యంగా చేసుకుం ది. గయాలో నిరసనలను అణిచివేసేందుకు ఒక అంటువ్యాధి అనే సాకును బీజేపీ కనుగొ ంటుంది. ప్రపంచంలోని అత్యంత శక్తివం తమైన ప్రజాస్వామ్యం చీకటిగా మారింది' అని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఢిల్లీలోని షాహీన్ బాగ్ ప్రాంతంలో పౌరసత్వ చట్టం (సిఏఏ) కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో పాల్గొన్న 82 ఏండ్ల బిల్కిస్ బానోను కూడా టైమ్స్ జాబితాలో చేర్చారు. భారతీయ మూలాలున్న సుందర్ పిచాయ్ పేరును కూడా టైమ్స్ తన ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో చేర్చింది. భారతదేశం నుంచి అమెరికాలో ఉద్యోగం కోసం వెళ్లి ట్రిలియన్ డాలర్ల కంపెనీకి సీఈవో కావడం వరకు అతని కథ ప్రత్యేకమైనదని టైమ్స్ మ్యాగజైన్ కొనియాడింది.

తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియా పాయింట్‌ను ప్రారంభించిన సమాచారశాఖ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి.

తాగునీటి ప్రాజెక్టుల కోసం కోకాకోలా కృషి

హైదరాబాద్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సురక్షిత తాగునీటి ప్రాజెక్టును ఏర్పాటు చేసినట్లు కోకాకోలా ఇండియా ఫౌండేషన్ ఆనందన ప్రకటించింది. తెలంగాణలోని ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ తదితర జిల్లాలలో జలధార ఫౌండేషన్, వాటర్ హెల్త్ ఇండియాలతో కలసి ఏడు వాటర్ హెల్త్ సెంటర్స్ కార్యక్రమాన్ని చేపట్టింది. సురక్షిత తాగునీటిని వినియోగాన్ని ప్రాచుర్యంలోకి తేవడం ద్వారా ఇక్కడ ప్రజల ఆరోగ్యం మెరుగు దలకు కృషి చేస్తోంది. గ్రామీణులు నీళ్ల ద్వారా వ్యాప్తి చెందే రోగాల బారిన పడడాన్ని తగ్గించేందుకు తోడ్పడి నట్లవుతుంది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాలో కూడా ఈ తరహా నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఇదే విధమైన ప్రాజెక్టులను ఈ ఫౌండేషన్ చేపట్టింది.

భూగర్భజలాలు నిరంతరం కలుషితం కావడం ఈ ప్రాంతాల ప్రజల తాగునీటి కష్టాలకు నిదర్శనంగా ఉంటున్నాయని జలధార ఫౌండేషన్ ప్రతినిధి బి.రామానంద్ తెలిపారు. నీటి పరిష్కారాలను అమలు చేసినప్పుడు గ్రామీణులు దీర్ఘకాలంలో గొప్ప ప్రయోజనాలు పొందగలుగుతారని తాము ఆశిస్తున్నామని ఆయన చెప్పారు.

నరసింహారెడ్డి నివాసంలో కొనసాగుతున్న సోదాలు

-5కోట్ల వరకు ఆస్తులు గుర్తించామన్న ఎసిబి

హైదరాబాద్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): ఆదాయానికి మించిన

కరోనాతో కేంద్రమంత్రి సురేశ్ అంగడి మృతి

-ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణం

న్యూఢిల్లీ,సెప్టెంబర్24((ఆర్ఎన్ఎ): కేంద్ర రైల్వే సహాయ మంత్రి సురేశ్ అంగడి కరోనాతో బుధవారం రాత్రి ఎయిమ్స్‌లో మృతిచెందారు. ఆయన వయసు 65 ఏళ్లు. సెప్టంబర్ 11న కరోనావైరస్ పాజిటివ్ రావడంతో ఆయన్ను ఎయిమ్స్ లో చేర్పించారు. దాని గురించి ఆయనే స్వయంగా ట్వీట్ చేశారు. 'నాకు ఈ రోజు కరోనా రిపోర్టులో పాజిటివ్ వచ్చింది. నేను ఇప్పుడు బాగున్నాను. డాక్టర్ల సలహాలు తీసుకుంటున్నాను. గత కొన్ని రోజులుగా నాకు కాంటాక్టులోకి వచ్చిన వారు తమ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోగలరు. ఏవైనా లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకోండి' అని పెట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయన మృతికి సంతాపం తెలుపుతూ ట్వీట్ చేశారు.సురేశ్ అంగడి ఒక నిబద్ధత ఉన్న కార్యకర్త. ఆయన కర్ణాటకలో పార్టీని బలోపేతం చేసేందుకు చాలా శ్రమించారు. ఆయన అంకితభావం ఉన్న ఒక ఎంపీ, సమర్థులైన మంత్రి. అన్ని విభాగాలలో ఆయన ప్రశంసలు అందుకున్నారు. ఆయన మరణం బాధాకరం. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు నా సంతాపం. ఓం శాంతి' అన్నారు.

మామను పరామర్శించిన సిఎం జగన్

-తిరుపతి నుంచి నేరుగా హైదారాబాద్‌కు రాక

హైదరాబాద్,సెప్టెంబర్24((ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. తిరుమలలో కర్ణాటక ముఖ్యమంత్రి యడ్యూరప్పతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్న జగన్.. ప్రత్యేక విమానంలో రేణిగుంట నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రికి వచ్చారు. తన మామ గంగిరెడ్డిని పరామర్శించేందుకు సీఎం జగన్ తిరుపతి నుంచి నేరుగా హైదరాబాద్‌కు విచ్చేశారు. జగన్ సతీమణి వైఎస్ భారతి తండ్రి గంగిరెడ్డి అనారోగ్యంతో కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో జగన్ ఆసుపత్రికి వెళ్లి తన మామను పరామర్శించారు.

ఢిల్లీ అల్లర్ల కేసులో సల్మాన్ ఖుర్షీద్ పేరు

- ఛార్జిషీటులో నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ,సెప్టెంబర్24((ఆర్ఎన్ఎ): ఢిల్లీ అల్లర్ల కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాల్ ఖుర్షీద్ పేరు నమోదైంది. సెప్టెంబర్ 17వ తేదీన దాఖలు చేసిన 17 వేల పేజీల ఛార్జిషీటులో సల్మాన్ ఖుర్షీద్ పేరు ఉంది. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినందుకు ఆయన పేరును ఛార్జిషీటులో నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా అల్లర్లకు పాల్పడిన ఓ వ్యక్తి చెప్పిన సాక్ష్యం మేరకు సల్మాన్ ఖుర్షీద్ పేరును ఛార్జిషీటులో నమోదు చేసినట్లు సమాచారం. ఉమర్ ఖలీద్, సల్మాన్ ఖుర్షీద్, నదీం ఖాన్ కలిసి రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి ప్రజలను చైతన్యం చేశారని సదరు వ్యక్తి చెప్పినట్లు తెలుస్తోంది. ఆ సాక్షి పేరును పోలీసులు బయటపెట్టడం లేదు. ఆ సాక్షి చెప్పిన వివరాలను మెజిస్ట్రేట్ ఎదుట నమోదు చేశారు.

ఛార్జిషీటులో పేరు నమోదు అయిన విషయంపై సల్మాన్ ఖుర్షీద్ స్పందించారు. తాను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయలేదని చెప్పారు. చెత్త సమాచారం సేకరించి.. అభాసుపాలు చేయాలనుకుంటే.. మీరే మలినం అవుతారని పేర్కొన్నారు. న్యాయమైన మద్దతు ఇచ్చేందుకే ఆ నిరసనలకు హాజరయ్యానని ఖుర్షీద్ తెలిపారు.

సెల్ఫ్ ఐసోలేషన్‌లో దత్తాత్రేయ

సిమ్లా,సెప్టెంబర్24((ఆర్ఎన్ఎ): హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ సెల్ఫ్ ఐసోలేషన్‌లోకి వెళ్లారు. రాజ్‌భవన్‌లో ఏడీసీ అధికారికి కరోనా వైరస్ పాజిటివ్ వచ్చినట్లు తేలడంతో దత్తాత్రేయ స్వీయ నిర్బంధంలోకి వెళ్లారు. అన్ని అపాయింట్‌మెంట్లను ఆయన రద్దు చేసుకున్నారు. గవర్నర్ కార్యదర్శి రాకేశ్ కన్వర్‌తో పాటు ఏడీసీ సిబ్బంది మొత్తాన్ని క్వారెంటైన్ చేశారు. ఆరోగ్యశాఖ సిబ్బంది వారందరికీ కోవిడ్ పరీక్షలు నిర్వహించనున్నది. ఇటీవల ఆ రాష్ట్రానికి చెందిన విద్యుత్ శాఖ మంత్రి సుక్రామ్ చౌదరీ, జలశక్తి మంత్రి మహేందర్ సింగ్ ఠాకూర్‌లు పాజిటివ్‌గా తేలారు. అయితే ఆ ఇద్దరూ ప్రస్తుతం కోలుకున్నారు. సురేందర్‌నగర్ ఎమ్మెల్యే రాకేశ్ జామ్వాల్, నాచన్ ఎమ్మెల్యే వినోద్ కుమార్‌లు కూడా కరోనా పరీక్షల్లో పాజిటివ్‌గా తేలారు. ఆ ఇద్దరూ ప్రస్తుతం మండి జిల్లాలోని కోవిడ్ కేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో కోవిడ్ కేసుల సంఖ్య 12,899కి చేరుకున్నది.

కరోనా బారిన పడ్డ నటుడు విజయ్ కాంత్

-నటి శ్వేతా తివారి

చెన్నై,సెప్టెంబర్24((ఆర్ఎన్ఎ): నటుడు, డీఎండీకే నాయకుడు విజయ్‌కాంత్ కరోనా బారిన పడ్డారు. దీంతో ఆయన మియోట్ ఇంటర్నేషనల్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. తేలికపాటి లక్షణాలు రాగా.. దవాఖానలోనే చికిత్స తీసుకుంటున్నారని ఆసుపత్రి గురువారం విడుదల చేసిన మెడికల్ బులెటిన్‌లో తెలిపింది. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, పూర్తిస్థాయిలో కోలుకుంటాడని హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ పృథ్వీ మోహన్‌దాస్ హెల్త్ బులిటెన్‌లో పేర్కొన్నారు. త్వరలోనే డిశ్చార్జి చేయనున్నట్లు చెప్పారు. అంతకుముందు, విజయకాంత్‌కు తేలికపాటి కరోనా లక్షణాలు మాత్రమే ఉన్నాయని డీఎండీకే పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని చెప్పింది. ఎప్పటిలాగే ఆయన సాధారణ పరీక్షల కోసం మియోట్ ఇంటర్నేషనల్ దవాఖానకు వెళ్లగా.. కొవిడ్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో తేలికపాటి లక్షణాలు కనపడడంతో దవాఖానలోనే చికిత్స పొందుతున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, అభిమానులు ఆయన కోలుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. నటుడు శరత్‌కుమార్ 'స్నేహితుడు విజయకాంత్ కరోనా సంక్రమణ నుంచి కోలుకుంటారని, త్వరలో స్వస్థత పొంది తిరిగి రావాలని నేను సర్వశక్తిమంతుడైన దేవుడిని ప్రార్థిస్తున్నాను' అంటూ ట్వీట్ చేశారు.

సినీనటి శ్వేతా తివారికి కరోనా

దేశంలో కరోనా విజృంభణ కొనసాగుతోంది. ఇప్పటికే దేశంలో కేసుల సంఖ్య 56లక్షలు దాటిపోయింది. సాధారణ ప్రజలతో పాటు సెలబ్రిటీలు సైతం కరోనా బారిన పడటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా హిందీ సీరియల్ 'మేరే డాడ్ కీ దుల్హన్' నటి శ్వేతా తివారీ కి కరోనా పాజిటివ్ వచ్చింది. ఈ విషయాన్ని నటి స్వయంగా వెల్లడించింది. తనకు ఈ నెల 16 నుండి కరోనా లక్షణాలు ఉన్నాయని టెస్ట్ చేసుకోగా పాజిటివ్ గా నిర్ధారణ అయ్యిందని వెల్లడించింది. దాంతో వచ్చేనెల 1వ తేదీ వరకు హోమ్ ఐసోలేషన్ లో ఉంటానని ప్రకటించింది. ప్రస్తుతం తనకు టఫ్ టైం నడుస్తుందని పేర్కొంది. తనకు కరోనా పాజిటివ్ రావడంతో తనను కాంటాక్ట్ అయ్యిన వారు కరోనా టెస్ట్ చేసుకోవాలని సూచించింది.

శంకరవ్వ కుటుంబాన్ని పరామర్శించిన ఏనుగు మనోహర్ రెడ్డి

వేములవాడ, సెప్టెంబర్ 24 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి లో అనారోగ్యంతో చనిపోయిన కొల్లూరి శంకరవ్వకుటుంబాన్ని గురువారం టీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.వీరితోపాటు సింగిల్ విండో చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి, గుడిసె సదానందం, తిరుపతి, అనిల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జిఎస్టీ వాటా నిధులు ఇవ్వకుండా కేంద్రం కిరికిరి

బోర్ల కాడ మీటర్లు పెడతామంటే ఓట్లేస్తారా?
మీటర్లు వద్దనుకుంటే టిఆర్ఎస్‌కు ఓటేయండి
దుబ్బాక ప్రచారంలో మంత్రి హరీష్ రావు

సిద్దిపేట,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): తెలంగాణకు జిఎస్టీ కింద హక్కుగా రావాల్సిన నిధులు ఇవ్వకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆర్థికశాఖ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. హక్కుగా రావాల్సిన కోటా ఇవ్వకుండా బీజేపీ ప్రభుత్వం మాయమాటలు చెబుతున్నదని హరీశ్ రావు కేంద్రంపై ధ్వజమెత్తారు. తెలంగాణ వాటాగా జీఎస్టీ, 14వ ఆర్థిక సంఘం నిధుల కింద కేంద్రం 10 వేల కోట్ల రూపాయలు ఇవ్వాలన్నారు. రాయపోల్ మండల కేంద్రంలోని మధుసూదన్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మండలంలోని 266 మంది రైతులకు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ వేలేటి రోజ శర్మతో కలిసి.. మంత్రి పట్టాదారు పాసు పుస్తకాలు, వర్షాలకు కూలిన ఇండ్లకు నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ..టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అన్నారు. వారి సంక్షేమమే లక్ష్యం పని చేస్‌తోందని, ఆరేండ్లుగా రైతుల కోసమే పని చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం బాగు చేయకుండా రైతులపై బాంబులు వేస్తున్నదని పేర్కొన్నారు.

బాయిల కాడ, బోర్ల కాడ మీటర్లు పెట్టి బిల్ కలెక్టర్లతో.. బిల్లు వసూళ్లకు పెడతారట. మీటర్లు కావాలంటే.. బీజేపీకి ఓటు వేయండి. మీటర్లు వద్దంటే.. మన కేసీఆర్ సారూ.. టీఆర్ఎస్ కారు గుర్తుకే ఓటు వేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగలేదని

.సిద్దిపేట జిల్లా రాయ్‌పోల్‌లో రెవన్యూ చట్టానికి మద్దతుగా చేపట్టని ట్రాక్టర్ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడిని మంత్రి హరీష్ రావు. చిత్రంలో ఎంపి ప్రభాకర్ రెడ్డి, వంటేరు ప్రతాపరెడ్డిలు ఉన్నారు

పేర్కొన్నారు. కానీ సంక్రాంతికి గంగిరెద్దుల మాదిరిగా ఓట్ల కోసం వచ్చేవారెవరో.. గుర్తించాలని కోరారు.

రైతులు కొత్త పట్టాదారు పాసు పుస్తకాల కోసం గతంలో ఆఫీసుల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడేవారని, అయినా పాసు పుస్తకాలు పొందేవారు కారన్నారు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన కొత్త రెవెన్యూ చట్టంతో రైతుల సమస్యలు తీరిపోతాయన్నారు. మండలంలోని 11,317 ఖాతాలకు 10,022 ఖాతాలు క్లియరెన్స్ చేసినట్లు.. వాటిలో ఇప్పటికే 9,756 పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసుకున్నామని తెలిపారు. మిగిలిన పట్టాదారు పాసు పుస్తకాలను త్వరితగతిన క్లియరెన్స్ చేసి రైతులకు అందివ్వాలని ఆర్డీవోను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో ఎప్సీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ పద్మాకర్, ఆర్డీవో విజయేందర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

-పరివార్ మహిళలకు శిక్షణ ప్రారంభోత్సవంలో గవర్నర్

హైదరాబాద్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): మహిళలు ఆర్థిక సాధికారత సాధించడానికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. బుధవారం రాజ్‌భవన్ పరివార్ మహిళలకు రెండు నెలలపాటు అందించనున్న స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని రాజ్‌భవన్ కమ్యూనిటీహాల్‌లో గవర్నర్ ప్రారంభించారు. ఈ స్వయం ఉపాధి శిక్షణను అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ ప్రిన్యూర్స్‌ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ మహిళలు సంపాదించిన ప్రతి పైసా కూడా కుటుంబ సంక్షేమానికి ఖర్చుపెడతారని, ఇది కుటుంబ అభివృద్ధికి అత్యంత ఉపయోగమని అన్నారు. కోవిడ్ లాంటి సంక్షోభ సమయంలో కుటుంబాల ఆర్థిక వనరులు ఇబ్బందులకు గురవుతున్నాయని, దీనికోసం తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ పొంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తమను తాము మలుచుకుని ఆర్థిక స్వావలంబన, సాధికారత సాధించాలని సూచించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితోనే రాజ్‌భవన్ పరివార్ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ప్రారంభించినట్టు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలను భవిష్యత్ ఎంటర్ ప్రిన్యూర్స్‌గా ఎదగడానికి అవసరమైన లోన్‌లు, మార్కెటింగ్ కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కాలనీల్లో, రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ల్లో కూడా మహిళలకు, యువతకు స్వయం ఉపాధి శిక్షణ కోర్సులు ఏర్పాటు చేయాలని గవర్నర్‌పిలుపునిచ్చారు. ఉద్యోగాల కోసం ఎదురుచేసే వారికంటే ఉద్యోగాలను సృష్టించే వారిగా యువతను తీర్చిదిద్దాలని గవర్నర్ సూచించారు. రాజ్‌భవన్ పరివార్ మహిళలకు మొదటి దశలో మొత్తం 31 మందికి మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇస్తామని గవర్నర్‌సెక్రటరీ సురేంద్ర మోహన్ తెలిపారు.

కొడాలి నాని వ్యాఖ్యలపై భగ్గుమన్న బిజెపి

నానిని తక్షణమే సిఎం జగన్ తొలగించాలి
హిందువులపై కేసులు ఎత్తేయాలని
ప్రధాని వ్యాఖ్యలకు నిరసనగా నేడు నిరసనలు

విజయవాడ,సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ): ప్రధాని మోదీపై మంత్రి కొడాలి నాని వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. మంత్రిని తప్పించాలని లేకుంటే ఊరుకునేది లేదని కూడా హెచ్చరించింది. కొడాలి నాని తన స్థాయిని మరచి ప్రధానిపై విమర్శలు చేశారని బిజెపి నేతలు మండిపడ్డారు. నాని వ్యాఖ్యలను ఎంపీ జీవీఎల్ నరసింహారావు తీవ్రంగా ఖండించారు. ప్రధాని మోదీ, సీఎం యోగి ఆచరణ, నిబద్ధత తెలిసి కూడా కొడాలి నాని అనుచిత వ్యాఖ్యలు చేశారని తప్పుబట్టారు. కొడాలి నానిని మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వైసీపీ, టీడీపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెబుతారని జీవీఎల్ హెచ్చరించారు.

చిల్లర వ్యాఖ్యల నానిపై చర్యలు తీసుకోవాలి

ప్రధాని మోదీ, యూపీ సీఎంపై మంత్రి కొడాలి నాని సంచలన వ్యాఖ్యలు చేయాలని చిల్లరగా మాట్లాడుతున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి మండిపడ్డారు. 'సినిమా నిర్మాత కాబట్టి.... ప్రజాస్వామ్యం కూడా సినిమా అనుకుంటున్నారు. నేటి వ్యాఖ్యలు ద్వారా కొడాలి నాని రాజకీయ ఆత్మహత్య చేసుకున్నారు. చంద్రబాబు.. జగన్ ట్రాప్‌లో పడి 2019లో ఓడిపోయారు. నేడు చంద్రబాబు వేసిన ట్రాప్‌లో జగన్ పడినట్లున్నారు. కొడాలి నాని తీవ్ర వ్యాఖ్యలు చేయడం ద్వారా చంద్రబాబు ప్లాన్ వర్కవుట్ అయ్యింది. విమర్శలు వస్తున్నా కొడాలి నాని వ్యాఖ్యలు చేస్తున్నారంటే మాకు కుట్ర అనుమానం ఉంది. ఏపీలో పూటకో భాష, పూటకో వేషం వేసే ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. అంతర్వేది లో భక్తులుపై కేసులు పెడితే... ఈ పార్టీలు ఎందుకు మాట్లాడలేదు. బీజేపీ మాత్రమే హిందూ ఆలయాలపై దాడులకు నిరసనగా పోరాటం చేశాయి. టీడీపీ వడగొట్టిన ఆలయాల నిర్మాణం చేపడతామని ప్రకటించడం వెనుక ప్రభుత్వం కుట్ర ఉంది. దేవాదాయ భూములు, ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పంచి పెడు తుంది. దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి తన ఇంటి ఎదురు ఉన్న ఆలయాన్ని అభివృద్ధి చేయలేక పోయారు. టీటీడీకి చెందిన ఐదువేల కోట్లు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇదే తరహాలో క్రిస్టియన్, ముస్లింల ఆస్తులు తీసుకుని పంచగలరా? బీజేపీకి మీలాగా మత రాజకీయాలు చేయడం అలవాటు లేదని పేర్కొన్నారు. ప్రజలను రెచ్చగొట్టేలా నాని వ్యాఖ్యలు చేస్తే డీజీపీ కేసు ఎందుకు పెట్టలేదన్నారు. చర్చి మీద రాళ్లు వేశారని 41 మందిపై కేసు పెట్టిన పోలీసులకు నాని వ్యాఖ్యలు కనిపించవా? మీ మంత్రి విచ్చలవిడిగా మాట్లాడుతుంటే జగన్ స్పందించరా? భారత రాజ్యాంగం, చట్టాలు కొడాలి నానికి వర్తించవా? సీఎం స్పందించి నానిని బర్తరఫ్ చేయకుంటే.. ఆయనను అడ్డుకుంటామని హెచ్చరించారు. 24గంటల్లో నానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. వైసీపీలో పిచ్చి పట్టిన వారు కొంతమంది మంత్రులుగా ఉన్నారు. కేసీఆర్ సహకారంతో హైదరాబాద్ ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించాలి. కొడాలి నాని చేస్తున్న వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం కాదనేది స్పష్టం. మాతో పెట్టుకున్న చంద్రబాబు ఏమయ్యారో.. నాని తెలుసుకోవాలి. కొడాలి నానిని మంత్రి పదవి నుంచి తప్పించే వరకు బీజేపీ ఊరుకోదు' అన్నారు.

మదమెక్కి మాట్లాడిన కొడాలి నాని: మాధవ్

ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగిపై మంత్రి కొడాలి నాని చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ తీవ్రంగా ఖండించారు. 'మోదీ, యోగి ఆదిత్యలపై మదం ఎక్కి మాట్లాడుతున్నారు. మంత్రిని కదా అని నోటికొచ్చినట్లుగా మాట్లాడితే సహించేది లేదు. ఆంజనేయ స్వామి విగ్రహం, రథం దగ్ధం, అమ్మవారి వెండి సింహాలపై చేసిన వ్యాఖ్యలతో ప్రజలు తిడుతున్నారు. ప్రధాని మోదీ, యోగి ఆదిత్యల జీవితాల గురించి కొడాలి నానికి ఏం తెలుసు. నిన్నటి వరకు మంత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాం. ఈరోజు చేసిన వ్యాఖ్యలతో కొడాలి నానిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నానిని తొలగించాలంటూ ఆందోళనలు చేపడతాం. మోదీ, యోగి ఆదిత్య జీవన శైలి తెలుసు కోవాలి. వారి సతీమణి గురించి మాట్లాడటానికి మంత్రికి సిగ్గుండాలి. తిరుమలలో ఉన్న నాని... అక్కడ ఉన్న వెంకన్న రాయా, బొమ్మా, దేవుడా చెప్పాలి. ప్రభుత్వం కూడా స్పందించి నానిపై చర్యలు తీసుకోవాలి. అక్రమంగా అరెస్ట్ చేసిన హిందూవాదులపై కేసులు కూడా ఎత్తివేయాలి. సీఎం జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకోవడం లేదంటే... ఆయనపై కూడా అనుమానాలు కలుగుతున్నాయి. దేవాదాయ శాఖ మంత్రి కనీసం ఖండించక పోగా.. అవహేళనతో మాట్లాడుతున్నారు. కొడాలి నానిని మంత్రి పదవి నుంచి తప్పించే వరకు మా పోరాటం కొనసాగిస్తాం' అని మాధవ్ తెలిపారు.

మాస్క్ ముఖానికి బండికి కాదు

-పోలీస్ శాఖ హెచ్చరిక ట్వీట్

హైదరాబాద్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): సోషల్ మీడియాలో హైదరాబాద్ పోలీస్ శాఖ చాలా చురుగ్గా ఉంటున్నారు. వాహనదారులకు అవగాహన కలిగించేందుకు.. అర్థవంతంగా, వినోదాత్మకంగా ట్వీట్లు చేస్తున్నారు. తాజాగా ఓ వాహనదారుడు తన నెంబర్ ప్లేట్ కనిపించడకుండా మాస్క్ అడ్డం పెట్టాడు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఈ విషయాన్ని ట్వీట్ చేస్తూ... అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీన్ని రీ ట్వీట్ చేసిన రాష్ట్ర పోలీస్ విభాగం.. మాస్క్ ముఖానికి, బండికి కాదు అని పేర్కొంది. ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారా చలానా తప్పించుకోవచ్చని పేర్కొంది. ట్రాఫిక్ రూల్స్ అనేవి అందరి సౌకర్యార్థం, క్షేమం కోసమని గుర్తించాలని తెలిపింది.

ఎపి మెడికల్ టెక్నాలజీ జోన్‌కు 7.49 కోట్లు

-విజయసాయి ప్రశ్నకు కేంద్రమంత్రి సదానంద సమాధానం

న్యూఢిల్లీ,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ మెడికల్ టెక్నాలజీ జోన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 25 కోట్ల ఆర్థిక సహాయంలో భాగంగా ఇప్పటి వరకు 7.49 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు కెమికల్స్, ఫెర్టిలైజర్స్ శాఖ మంత్రి డీవీ సదానంద గౌడ తెలిపారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ.. బల్క్ ఇండస్ట్రీకి కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేసే పథకం కింద విశాఖపట్నంలో మెడ్ టెక్ జోన్ ఏర్పాటుకు 25 కోట్ల సాయం అందించే అంశానికి కేంద్ర ప్రభుత్వం తుది ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ మొత్తంలో 30 శాతం నిధులను ఏఎంటీజెడ్‌కు విడుదల చేసినట్లు తెలిపారు. నాలుగేళ్ళుగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలుపై రైతులు ఇతర భాగస్వామ్య పక్షాలతో జరిపిన చర్చలు, సంప్రదింపుల అనంతరం ఈ పథకాన్ని సమూలంగా మార్పులు చేయాలని నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ రాజ్యసభలో విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ చెప్పారు. అందులో భాగంగా వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంగా 2020 ఖరీఫ్ సీజన్ నుంచి దీనిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. పంటల బీమాపై దీర్ఘకాలికంగా రైతులు చేస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ పథకంలో చేరాలా, వద్దా అని నిర్ణయించుకునే స్వేచ్ఛను రైతులకే విడిచిపెట్టినట్లు మంత్రి తెలిపారు. 2020 ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమాకు సంబంధించి అందిన వివరాల ప్రకారం పంటలు బీమా చేసుకునే రైతుల సంఖ్య గత ఖరీఫ్ సీజన్ మాదిరిగానే ఉందని చెప్పారు.

అక్టోబర్ 2 నుంచి రాష్ట్రంలో 'మనం-మన పరిశుభ్రత'

రెండోదశ కార్యక్రమంపై మంత్రి పెద్దిరెడ్డి లేఖ

అమరావతి,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): అక్టోబర్ 2 నుంచి రాష్ట్రంలో 'మనం-మన పరిశుభ్రత' రెండోదశ కార్యక్రమం ప్రారంభించబోతున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి మండలానికి 5 నుంచి 10 గ్రామాలలో అమలవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులకు మంత్రి బుధవారం లేఖ రాశారు. జూన్ 1న మొదటిదశ మనం-మన పరిశుభ్రత ప్రోగ్రాం రాష్ట్రంలో ప్రారంభమైందని, జూలై 24 నుంచి 15 రోజుల పాటు పక్షోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా 1320 గ్రామ పంచాయతీల్లో తొలి దశ కార్యక్రమాలు జరిపినట్లు వెల్లడించారు. కోవిడ్-19 సమయంలో ఈ పక్షోత్సవాలు గ్రామాల్లో సత్ఫలితాలు ఇచ్చాయని మంత్రి తెలిపారు. ప్రజా భాగస్వామ్యంతో ప్లలెల్లో ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందని, 70 శాతం సీజనల్ వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చని అన్నారు.

కరోనా కష్టంలోనూ సంక్షేమ పథకాల అమలు

-బురదజల్లే యత్నాల్లో విపక్షాలు : కన్నబాబు

అమరావతి,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు. ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా బురద జల్లేందుకే ప్రతిపక్షాలు సమయం కేటాయిస్తున్నాయని మంత్రి కన్నబాబు దుయ్యబట్టారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమిత్‌షా, సీఎం జగన్ కలయిక వెనుక ఇష్టానుసారంగా ఎల్లోమీడియా రాతలు రాస్తోందని ఆయన మండిపడ్డారు. పిచ్చిరాతలతో ఎల్లో మీడియా ప్రజలను పక్కదారి పట్టిస్తోందని ధ్వజమెత్తారు. చంద్రబాబు తన హయాంలో ఆలయాలు కూలగొట్టించలేదా?. అప్పుడు ఆయనకు హిందుత్వం గుర్తుకురాలేదా? అని నిలదీశారు. అంతర్వేది రథం ఘటనలో ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి సీబీఐ విచారణకు ఆదేశించిందని పేర్కొన్నారు.

రైతులు కష్టాలు పడకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని కన్నబాబు పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ ధరల్లో తెలంగాణతో ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు రూ.80 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ పంట కొనుగోళ్లను టన్నుకు రూ.11 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. పెదవేగి ఫ్యాక్టరీకి తరలించే రైతులకు ఈ ధరల చెల్లింపు చేస్తామన్నారు. ఆయిల్ ఫామ్‌కు మద్దతు ధర ప్రకటించాలని కేంద్రాన్ని కోరామని తెలిపారు. మార్కెటింగ్ వ్యవస్థను రైతులకు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వివిధ వాణిజ్య పంటలను ప్రాసెసింగ్ చేయడం ద్వారా రైతులకు మరింత లబ్ది చేకూర్చేందుకు నిర్ణయించామన్నారు. త్వరలో ఆహారశుద్ధి పాలసీని ప్రకటిస్తామని వెల్లడించారు. వ్యవసాయ, అనుబ

రెవెన్యూ చట్టంతో దశాబ్దాల భూసమస్యలకు పరిష్కారం

కొత్త చట్టంతో ప్రజలకు మేలు: మంత్రి హరీష్ రావు

సిద్దిపేట,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): నూతన రెవెన్యూ చట్టంతో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మంత్రి హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయేతర ఆస్తులు కలిగి ఉన్నవారికి దేశంలోనే తొలిసారిగా పట్టాదార్ పాస్‌పుస్తకం జారీచేయనున్నట్టు తెలిపారు. జిల్లాలోని రాయపోల్ మండల కేంద్రంలో నూతన రెవెన్యూ చట్టానికి మద్దతుగా.. రైతులు చేపట్టిన ట్రాక్టర్ల ర్యాలీని మంత్రి హరీశ్ రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమానిక కృషి చేస్తుందన్నారు. బీజేపీ రైతు వ్యతికరేక ప్రభుత్వమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి యేటా పెట్టుబడి సాయం కింద 10వేల రూపాయలు సాయం చేస్తున్నదని గుర్తు చేశారు. ఈ విధంగా దేశంలో ఎక్కడైనా ఇస్తున్నారా.. అంటూ మంత్రి ప్రశ్నించారు. బీజేపీ రైతు వ్యతిరేక చట్టాన్ని అమలు చేస్తున్న విధానం నచ్చకనే.. ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీకి చెందిన అకాలీదళ్ మంత్రి రాజీనామా చేశారని ఎద్దేవా చేశారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆస్తులకు పూర్తిరక్షణ కల్పించాలన్నదే కొత్త రెవెన్యూ చట్టం ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. భూవివాదాలు, ఘర్షణలను నివారించి ప్రజల ఆస్తులకు పక్కా హక్కులు కల్పించేందుకే ఈ పాస్‌పుస్తకాలు జారీచేస్తున్నట్టు పేర్కొన్నారు. రెవెన్యూ చట్టం అమలు, ధరణి పోర్టల్ రూపకల్పన విప్లవాత్మక మార్పు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూముల పరస్పర కొనుగోళ్ల మార్పిడికి సంబంధించిన సాదాబైనామాలను ఉచితంగా మ్యుటేషన్ చేయడానికి సిఎం కెసిఆర్ త్వరలో నిర్ణయం తీసుకుంటారని అన్నారు.

రైతు కష్టం తెలిసిన సిఎం కెసిఆర్

సీఎం కేసీఆర్ రైతు శ్రేయోభిలాషి, రైతు కష్టం తెలిసిన మనిషిగా రైతుల కోసం ఆలోచన చేస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు చెప్పారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో గురువారం మండలంలోని 546 మంది రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 70 ఏండ్లలో జరగని పనిని ఆరేండ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో పూర్తి చేసుకున్నామని తెలిపారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం రాకముందు రైతుబంధు పథకం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల గుండెల్లో రెండు బాంబులు వేసిందని పేర్కొన్నారు. 70 లక్షల మెట్రిక్ టన్నుల విదేశీ మక్కలు కొనుగోలు కోసం అగ్రిమెంట్ చేశారని, ఎవరి ప్రయోజనం కోసం చేశారో సమాధానం చెప్పాలని బీజేపీ పార్టీని ప్రశ్నించారు. అలాగే బాయికాడ, బోర్లకాడ మీటర్లు పెట్టి కరెంట్ బిల్లులు వసూళ్లు చేయాలని రైతులకు అన్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని విమర్శించారు. వ్యవసాయ మార్కెట్లను రద్దు చేసి కార్పొరేటీ కరణకు తెరలేపి నయా జమిందారు వ్యవస్థను తెస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం యేటా 45 వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో 56 వేల మందికి పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. బీడీ కార్మికులకు పెన్షన్స్ టీఆర్ఎన్ ప్రభుత్వం మాత్రమే అందజేస్తుందన్నారు.

మహబూబ్ నగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

మహబూబ్ నగర్ , సెప్టెంబర్ 24: మత్స్య కార్మికుల సంక్షేమానికి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కేసీఆర్ అర్బన్ ఏకో పార్కులోని చెరువు, అప్పన్నపల్లి గొంగోస్ కుంట చెరువు, పోసాని కుంట చెరువుల్లో జిల్లా కలెక్టర్ వెంకట్ రావుతో కలిసి మంత్రి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..భవిష్యత్తులో ఇక్కడి నుంచే చేపలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే విధంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య, జిల్లా రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు గోపాల్ యాదవ్, ఏడీ ఫిషరీస్ రాధరోహిణి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఐ కుటుంబానికి తోటి ఉద్యోగులు అండ

విరాళం రూపంలో భారీగా ఆర్థిక సాయం

హైదరాబాద్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): తుపాకీ మిస్ఫ్ర్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఆర్ఎస్ఐ ఆదిత్య సాయి కుమార్ కుటుంబానికి తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. మేమున్నామంటూ చందాలు వేసుకుని ఆర్థిక సహాయం అందించారు. ఈనెల 16న ఛత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా టీఎస్ఎస్పీ బెటాలియన్‌కు చెందిన ఆదిత్య సాయి చేతిలోని తుపాకీ మిస్ఫ్ర్ కావడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. దీంతో తోటి ఉద్యోగులు ఆదిత్య కుటుంబానికి ఆర్థిక సహాయం చేసేందుకు పెద్ద ఎత్తున ముందుకు వచ్చారు. అందరూ కలిసి జమచేసిన 27,50,000 రూపాయల చెక్కును ఆదిత్య సాయి కటుంబానికి అందజేశారు. బెటాలియన్ అదనపు డిజిపి అభిలాష్ భిష్ణి స్వయంగా చెక్కును అందించారు. కష్టకాలంలో ఆదిత్య కటుంబానికి తోటి ఉద్యోగులు అండగా నిలబడటం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో ఆదిత్య కటుంబానికి మరింత అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇక కారుణ్య నియామకం కింద ఆదిత్య సోదరుడిని పోలీసు ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పేదలకు మేలు చేసేలా సంక్షేమ పథకాలు : మంత్రి కొప్పుల

పెద్దపల్లి,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లాలోని ధర్మారం మండల కేంద్రంలో 190 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి ,షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల పెండ్లింద్లు వారి తల్లిదండ్రులకు భారం కొవొద్దనే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథాకాలను అమలు చేస్తున్నారని తెలిపారు.

సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

వేములవాడ, సెప్టెంబర్ 24 (నేటినిజం ప్రతినిధి):ప్రజలు సైబర్ నేరగాళ్లు తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు వోనపూరిత ఆశలకు గురికావద్దు ని,పోలీస్ అధికారుల ఫేస్ బుక్ లను హ్యాక్ చేసి ఫ్రెండ్ లాగ డబ్బులు పంపించమని అడిగి ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారు. కావున వీటి బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ని కోరారు .ఇటీవల సైబర్ నేరగాళ్ళు రూటు మార్చారు. ఫేస్బుక్ లో పోలీసు ఉన్నతాధికారుల పేరుతోనకిలీ ప్రొఫైళ్లు సృష్టించి, 'అర్జెంటుగా డబ్బులు కావాలి,అంటూ మోసగిస్తున్నారు. వీరు పోలీసు ఉన్నత అధికారులకు సంబంధించిన నకిలీ ప్రొఫైళ్లను సృష్టిస్తూ, ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతారు.ఆ తర్వాత ఎంచుకున్న వారితో చాటింగ్ మొదలు పెడతారు.అవతలివారు. వీరిని పోలీసు అధికారే అని నమ్మడం వల్ల సులభంగా మోసగిస్తారు. అర్జెంటుగా కొంత డబ్బు అవసరమైంది. మీరు సర్దుబాటు చేస్తారా? ఒకట్రెండు రోజుల్లో తిరిగి ఇచ్చేస్తాను అంటూ తమ ప్లాన్‌ను అమలు చేస్తారు.నిజమైన పోలీసులే అని నమ్మి డబ్బు పంపితే అది ఎన్నటికీ తిరిగి రాదుఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలను హెచ్చరిచారు. పోలీసు అధికారుల పేరుతో ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చినవారు అతిగా చాటింగ్ చేస్తున్నా. అనుమానించాల్సిందేనని చెబుతున్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినవెంటనే పోలీస్ లకి తెలియచేయాలి అని సూచిస్తున్నారు.

అలాంటి అకౌంట్స్ పట్ల జాగ్రత్తగా ఉండండి.ఏ అధికారి కూడా మీతో చాటింగ్ చేసి అలా డబ్బులు అడగడు కాస్త ఆలోచించండి అని చెప్పారు.సైబర్ నేరాల కట్టడికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ. తెలిపారు

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డీన్ జోన్స్ హఠాన్మరణం

ముంబై హోటల్లో గుండెపోటుతో మృతి

ముంబై,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్, ప్రముఖ వ్యాఖ్యాత డీన్ జోన్స్(59) కన్నుమూశారు. ప్రస్తుతం ముంబైలో ఉన్న జోన్స్‌కు గురువారం గుండెపోటు రావడంతో చనిపోయారు. యూఏఈ వేదికగా జరుగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)లో బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ తరఫున వ్యాఖ్యానం చేసేందుకు ఆయన భారత్‌కు వచ్చారు. ముంబైలోని ఓ హోటల్‌లో గురువారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఆయనకు తీవ్ర గుండెపోటు వచ్చింది. స్టార్‌స్పోర్ట్స్ కామెంటరీ బృందంలో ఉన్న జోన్స్ ప్రస్తుతం ముంబైలోని స్టార్ హోటల్‌లో బయో సెక్యూర్ బబుల్‌లో ఉంటున్నారు. 1984 నుంచి 1992 మధ్య ఎనిమిదేండ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియాకు ప్రాతినిధ్యం వహించాడు. తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో ఆసీస్ తరఫున 52 టెస్టులు, 164 వన్డేలు ఆడాడు. టెస్టుల్లో 46.11 సగటుతో 3,631 పరుగులు సాధించాడు. అందులో 11 శతకాలు, 14 అర్ధశతకాలు ఉన్నాయి. వన్డేల్లో 44.61 సగటుతో 6,068 రన్స్ చేశాడు. పరిమిత ఓవర్ల క్రికెట్లో 7 శతకాలు, 46 హాఫ్‌సెంచరీలు సాధించాడు. 'ప్రొఫెసర్ డీనో'గా పేరుగాంచిన విక్టోరియా బ్యాట్స్‌మన్ జోన్స్ ఓపెనర్‌గా ఎటాకింగ్ బ్యాటింగ్ స్టైల్‌తో అలరించాడు. 245 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన జోన్స్ 19,188 రన్స్ సాధించడం విశేషం. మెల్‌బోర్న్‌లో జన్మించిన జోన్స్.. ప్రపంచవ్యాప్తంగా తన కామెంటరీతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. భారత మీడియా రంగంలోనూ ఆయన ప్రముఖ వ్యక్తిగా ఉన్నారు.

జర్నలిస్ట్ గౌతమ్ బాబు ఇంటిపై దాడి బాధాకరం

వేములవాడ, సెప్టెంబర్ 24 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలోని బుధవారం రాత్రి సీనియర్ పాత్రికేయు డు గౌతమ్ బాబు ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా వేములవాడ బిజెపి పార్టీ పక్షాన మున్సిపల్ కౌన్సిలర్ , బిజెపి టౌన్ ప్రెసిడెంట్ రేగుల సంతోష్ బాబు ఖండించారు . ఇట్టి దాడులు అప్రజాస్వామికం పాత్రికేయులు మీడియా వారు ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన నిలబడడం అనేది ప్రశ్నించే గొంతు గా వారికున్న బాధ్యత హక్కు దీన్ని జీర్ణించుకోలేని కొందరు అధికార పార్టీ నాయకులు సహనం కోల్పోయి అర్ధరాత్రి ఒక పాత్రికేయుడు ఇంటిపై దాడి చేయడం అనేది ఇది చాలా బాధాకరమైన విషయం ఇట్టి దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు ఇట్టి దాడిని పూర్తిగా ఖండిస్తున్నామని అన్నారు.

శ్రీవారి ఆన్‌లైన్ కల్యాణోత్సవ టికెట్ల కోటా విడుదల

తిరుమల,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): అక్టోబర్ నెలకు సంబంధించి శ్రీవారి ఆన్‌లైన్ కల్యాణోత్సవ టికెట్ల కోటాను టీటీడీ విడుదల చేసింది. అక్టోబర్ 16 నుంచి 24 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 25న శ్రీవారి పార్వేట ఉత్సవం ఉన్న కారణంగా ఆ తేదీల్లో కల్యాణోత్సవం లేదు. ఆన్‌లైన్ కల్యాణోత్సవంలో పాల్గొనే గృహస్తులు ఇద్దరికి టికెట్ బుక్ చేసుకున్న తేదీ నుండి 90 రోజుల్లోపు శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని టీటీడీ కల్పించింది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

వేములవాడ, సెప్టెంబర్ 24 (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి గడ్డం రాములు గత సంవత్సరం అనారోగ్యంతో మరణించగా ఆయన భార్య వెంకవ్వకు రూపాయలు 26,000, అలాగే మారుపాక మనోజ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందగా వైద్య ఖర్చుల సహాయార్థం రూపాయలు 23,000 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను టిఆర్ఎస్ నాయకులుమ్యాకల ఎల్లయ్య గురువారం అందజేశారు, ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు గారి కృషితో సీఎం సహాయ నిధి నుంచి ఇరువురికి చెక్కులు మంజూరయ్యాయన్నారు, ఎమ్మెల్యే రమేష్ బాబు నేతృత్వంలో చందుర్తి మండలం సర్వతోముఖాభివృద్ధి వైపు పయణిస్తుందన్నారు మండలంలోనే అత్యధికంగా జోగాపూర్ గ్రామానికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, మ్యాకల పర్శరాములు టిఆర్ఎస్ నాయకులు సంకోజీ అశోక్, గరిడే మహేష్, కోరే పర్శరాములు, గొల్లపల్లి పర్శరాములు, తుపాకుల శ్రీనివాస్, వరికెల కిష్టస్వామి, అమరబండ ప్రసాద్, గొంటి అనీల్, మారుపాక సతీష్, వరికెల శ్యాంరావు, యండి సమీర్, గడ్డం బాబు, ముత్యాల ప్రతాప్, నాగం నర్సయ్య, మ్యాదరి శంకర్, వట్టెంల రాములు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇద్దరు సీఎంలు

-కర్నాటక చౌల్ట్రీక్రి భూమిపూజ

తిరుమల,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉదయం మరోసారి దర్శించుకున్నారు. సీఎం జగన్‌తో కలిసి కర్ణాటక సీఎం యడియూరప్ప స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానికి వచ్చిన కర్ణాటక సీఎంకు, మహాద్వారం ప్రవేశ మార్గం వద్ద ముఖ్యమంత్రి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు ఇరు ముఖ్యమంత్రులకు తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. సీఎం జగన్‌తో కలిసి కర్ణాటక సీఎం యడియూరప్ప స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానికి వచ్చిన కర్ణాటక సీఎంకు, మహాద్వారం ప్రవేశ మార్గం వద్ద ముఖ్యమంత్రి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు ఇరు ముఖ్యమంత్రులకు తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్‌తో పాటు టీటీడీ చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే రోజా పాల్గొన్నారు. శ్రీవారి దర్శనం ముగించుకుని ఆలయం ఎదురుగా ఉన్న నాదనీరాజనంకు ఇద్దరు ముఖ్యమంత్రులు చేరుకున్నారు. లోక కళ్యాణర్థం కరోనా నేపథ్యంలో టీటీడీ గత మార్చి నెలనుంచి ధన్వంతరి మహాయాగం, ధన్వంతరి యోగ వశిష్ఠం, గీతాపారాయణం, సుందరకాండ పారాయణం నిర్వహిస్తోన్న కార్యక్రమంలో ఇరువురు సీఎం పాల్గొన్నారు. ఉదయం కర్ణాటక సీఎం యడియూరప్పతో కలిసి సీఎం జగన్ కర్ణాటక సత్రాల భవన నిర్మాణ భూమి పూజలో పాల్గొన్నారు. అనతంరం రేణిగుంట ఎయిర్‌పోర్ట్ నుంచి సీఎం జగన్ హైదరాబాద్‌కు బయల్దేరారు.

నకిలీ చెక్కుల కేసులో నిదితుడి లొంగుబాటు

కడప,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): సీఎం రిలీఫ్ ఫండ్ నకిలీ చెక్కులు సృష్టించిన భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి ఎట్టకేలకు ప్రొద్దుటూరు పోలీసుల ముందు గురువారం లొంగిపోయాడు. 25 వేల విలువ గల మూడు పాత చెక్కులను మార్ఫింగ్ చేసి 9 లక్షల 95 వేలతో నిందితుడు దొంగ చెక్కులను తయారు చేశాడు. కర్ణాటకలోని హోసూర్‌లో ఉండే సుబ్బిరామిరెడ్డి ద్వారా చెక్కులను మార్ఫింగ్ చేశారు. నకిలీ చెక్కులను గుర్తించిన బ్యాంకుల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బండారం గుట్టురట్టయింది. ఈ కేసును ప్రొద్దుటూరు డీఎస్పీ సుధాకర్ లోతుగా విచారణ చేపట్టారు.

సరికొత్త రికార్డుల దిశగా ఐపిఎల్

క్రికెటర్లను వెన్నాడుతున్న గాయాల భయం

దుబాయ్,సెప్టెంబర్24(ఆర్ఎన్ఎ): కరోనా సంక్షోభంలోనూ ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల నుంచి విశేషాదరణ లభిస్తుండటంతో లీగ్ విజయవంతంగా నడుస్తున్నది. అయితే లీగ్ ఆరంభమై కనీసం వారం రోజులు కూడా పూర్తికాకముందే ఆటగాళ్లు గాయాల బారిన పడటం ఆందోళన కలిగిస్తున్నది. ఐపీఎల్ 13వ సీజన్‌లో ఇప్పటి వరకు కేవలం ఐదు మ్యాచ్‌లు మాత్రమే జరిగాయి. ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మినహా మిగతా జట్లన్నీ ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడాయి. లాక్‌డౌన్, చాలా రోజుల పాటు ఆటగాళ్లు ఆటకు దూరంగా ఉండటంతో ప్రాక్టీస్, మ్యాచ్ మధ్యలో గాయపడుతున్నారు. కీలక ఆటగాళ్లు గాయాలతో ఇబ్బందులు పడుతుండగా.. సన్‌రైజర్స్ హైదరబాద్ ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌లో చీలమండ గాయంతో అతడు టోర్నీ నుంచి నిష్క్రమించాడు. సన్‌రైజర్స్ ప్రధాన బ్యాట్స్‌మన్ కేన్ విలియమ్సన్ తొడ కండరాల గాయంతో ఆర్‌సీబీతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. తర్వాతి మ్యాచ్‌కు అతడు అందుబాటులోకి వస్తాడో లేదో అనుమానంగానే ఉంది. ముంబై ఇండియన్స్‌తో లీగ్ ఆరంభ మ్యాచ్‌లో అంబటి రాయుడు అర్ధశతకంతో చెలరేగి చెన్నై జట్టుకు విజయాన్నందించాడు. అదే మ్యాచ్‌లో అతడి కండరాలు పట్టేయడంతో రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లోనూ అతడు ఆడలేదు. ప్రస్తుతం అతడు గాయం నుంచి కోలుకుంటున్నాడని, మరో మ్యాచ్‌కు కూడా అదే అవకాశం లేదని చెన్నై సీఈవో కాశీ విశ్వనాథన్ తెలిపారు. సెప్టెంబర్ 10న సీపీఎల్ ÷నైల్ మ్యాచ్‌కు ముందు బ్రావో మోకాలికి గాయమైంది. ఆ మ్యాచ్ ఆడినప్పటికీ బౌలింగ్ చేయలేదు. గాయం కారణంగానే చెన్నై ఆడిన తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. యువ ఆల్‌రౌండర్ శామ్ కరన్ బంతితో రాణిస్తుండటంతో బ్రావోకు మరికొన్ని రోజుల పాటు విశ్రాంతినివ్వాలని చెన్నై భావిస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 13వ సీజన్‌లో తన తొలి మ్యాచ్ తొలి ఓవర్‌ను అద్భుతంగా ఆరంభించాడు. మొదటి ఓవర్‌లోనే రెండు వికెట్లు పడగొట్టాడు. తన బౌలింగ్‌లో బ్యాట్స్‌మన్ బాదిన బంతిని ఆపేందుకు డైవ్ చేయగా నేలపై పడటంతో తన భుజానికి బలమైన గాయమైంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. దీనీ ఆడే తర్వాతి మ్యాచ్‌లో అశ్విన్ ఆడతాడో లేదో తెలియదు. కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌తో మ్యాచ్‌కు ముందు పేసర్ ఇషాంత్ శర్మకు వెన్నునొప్పి కావడంతో ఢిల్లీ తరఫున బరిలో దిగలేకపోయాడు. ఐతే అతని గాయంపై ఎలాంటి సమాచారం లేదు. ఆర్‌సీబీ ఆల్‌రౌండర్ క్రిస్ మోరిస్ కూడా సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌కు ఆడకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. మ్యాచ్ ఆరంభానికి ముందు పక్కటెముకలు పట్టేయడంతో మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు.

గ్రామ గ్రామాన టిఆర్‌కె సేవకులు

స్వచ్ఛందంగా ట్రస్టులో చేరుతున్న యువకులు..

వేములవాడ, సెప్టెంబర్ 24 (నేటినిజం ప్రతినిధి)మారుమూల ప్రాంతాలకు టి ఆర్ కె ట్రస్ట్ సేవలు విస్తరించాలనే ఉద్దేశంతో యువకులు స్వచ్ఛందంగా ట్రస్ట్ లో చేరేందుకు వస్తున్నారు.వేములవాడ రూరల్ మండలంలోని ఎదురుగట్లకు చెందిన యువకులు స్వచ్ఛంద సేవ చేయడానికి గురువారం టి.ఆర్.కె ట్రస్ట్ లో చేరారు.

టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ ఆధ్వర్యంలో ట్రస్టు తరుపున ప్రజలకు స్వచ్ఛందంగా సేవ చేయడానికి యువకులు సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి నమోదు పత్రాలను అందజేశారు. అనంతరం టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ మాట్లాడుతూ నిరు పేద ప్రజలకు స్వచ్ఛందంగా సేవ చేయడానికే మా ట్రస్ట్ సేవలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. అలాగే ట్రస్ట్ లో చేరిన యువకులు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛందంగా సేవ చేస్తున్న టి ఆర్ కె ట్రస్టులో చేరి మా వంతు ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు. ట్రస్ట్ లో చేరిన యువకులు ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ కు శాలువాతో సన్మానించి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో లో ట్రస్ట్ డైరెక్టర్ లు కుమ్మరి శంకర్, మొట్టల మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాయిని శేఖర్, టి ఆర్ కె ట్రస్ట్ వర్కింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

క్రిమిసంహారకాల వినియోగంలో తెలంగాణ రైతులకు రక్షణ కల్పనకు వైద్యులకు సింజెంట శిక్షణ

ఆదిలాబాద్, సెప్టెంబర్ 24:: గుజరాత్, మహారాష్ట్ర తర్వాత అత్యధికంగా పత్తి పంట సాగు వృద్ధిలో మూడో స్థానంలో తెలంగాణ నిలిచింది. ఇతర వాణిజ్య పంటలతో పోలిస్తే పత్తి పంటకు క్రిమి సంహారకాల వినియోగంలో అన్నదాతలకు అవగహనాలోపం ఉంది. కనుక ప్రస్తుతం కొవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో రైతుల ఆరోగ్యం, భద్రత కోసం జిల్లా అధికారుల సహకారంతో 'ఐ-సేఫ్ (రైతుల సాధికారత కోసం భద్రతా అవగాహనపై బోధన)'అనే ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం పేరిట వైద్యులకు సింజెంట ఇండియా అవగాహనా కార్యక్రమాలు చేపట్టింది. డాక్టర్ వీవీ పిళ్లై పర్యవేక్షణలో వైద్యులకు శిక్షణ, అవగాహన కల్పిస్తున్నారు. క్రిమి సంహారకాల నుంచి రక్షణ కల్పించడానికి, వాటి నుంచి కోలుకునే మార్గాలు, అత్యవసర సమయాల్లో చికిత్స విధి విధానాలపై వైద్యులకు శిక్షణ ఇస్తారు.

ఆదిలాబాద్ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) డాక్టర్ ఎస్ కిషన్ స్పందిస్తూ సింజెంట చొరవను ప్రశంసించారు. 'అత్యవసర సమయాల్లో రైతులను కాపాడేందుకు వైద్యులు తీసుకోవాల్సిన చర్యలపై సైంజెంటా శిక్షణ ఇవ్వడం గొప్ప చొరవ. ప్రతియేటా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని డాక్టర్ ఎస్ కిషన్ సూచించారు. ఆదిలాబాద్ జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ సింజెంట ప్రయత్నాలను అభినందించారు. క్రిమిసంహారాలతో అస్వస్థతకు గురైన రైతులకు ప్రథమచికిత్స, యాంటీడోట్లు ఇవ్వడానికి అవసరమైన పరిజ్ఞానం వైద్యులకు అందించేందుకు, తదుపరి సమీప ఆరోగ్య కేంద్రానికి వారిని తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకునేందుకు వైద్యులకు శిక్షణ ఇవ్వడం, తద్వారా రైతులను కాపాడటం వంటి చర్యలు చేపట్టిన సింజెంటను అభినందిస్తున్నా' అని తెలిపారు.

విద్య దానం.... మహాదానం

వేములవాడ, సెప్టెంబర్ 24 (నేటినిజం ప్రతినిధి):విద్యా దానం మహాదానం అనే సిద్ధాంతానికి కట్టుబడి టి ఆర్ కే ట్రస్ట్ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు తోట రామ్ కుమార్ అన్నారు.వేములవాడ పట్టణానికి చెందిన మంచాల రాజశేఖర్ అనే నిరుపేద వైశ్య కుటుంబానికి చెందిన అతని కూతురు మంచాల సౌమ్య పై చదువుల నిమిత్తం ట్రస్ట్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో తోట రామ్ కుమార్ చేతుల మీదుగా పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు .ఈ సందర్భంగా రామ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిభ ఉండి ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క పేద విద్యార్థి కూడా చదువులకు దూరం కావద్దన్న ఉద్దేశంతో ట్రస్టు అన్ని విధాలుగా వారికి బాసటగా ఉంటుందని అన్నారు. ద